

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సంక్షేమం

వివరాలు 4 లో

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :231 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 17 జులై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## న్యూజిలాండ్‌లో భూకంపం...
# సునామీ హెచ్చరిక జారీ

- న్యూజిలాండ్ దక్షిణ దీవిని వణికించిన భూకంపం
- రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైన తీవ్రత
- పశ్చిమ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ
- ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు వెళ్లాలని అధికారుల సూచన
- తక్షణ ప్రాణ, ఆస్తి నష్టంపై సమాచారం లేదు



**సింధూరదర్శిని:**న్యూజిలాండ్‌లో భూకంపం సంభవించింది. దేశంలోని దక్షిణ దీవిలో గురువారం 6.3 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పశ్చిమ తీర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫియోర్డ్‌ల్యాండ్ రీజియన్‌లోని టె అనౌకు 40 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా మిల్ఫోర్డ్ సౌండ్ నుంచి ప్యూసెగుర్ పాయింట్ వరకు ఉన్న దక్షిణ దీవి పశ్చిమ తీరానికి సునామీ మిగతా 2లో...

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?
## కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

-ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
-డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
-సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
-ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
-పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం



**న్యూఢిల్లీ:**పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని మిగతా 2లో...

## రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం

- సత్యకుమార్ యాదవ్
- పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సత్యకుమార్, పురందేశ్వరి, మాధవ్ తదితరులు
- పోలవరం కోసం మరో రూ.30వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం రెడీగా ఉందన్న సత్యకుమార్
- పోలవరంను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న మాధవ్



**అమరావతి, సింధూరదర్శిని:** రాయలసీమ ప్రాంతంలో దశాబ్దాలుగా వేధిస్తున్న కరవు రక్కసిని తరిమి కొట్టేందుకు గోదావరి జలాల తరలింపే శాశ్వత పరిష్కారమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ భారీ ఆర్థిక మద్దతు ఇస్తోందని ఆయన కొనియాడారు. ఈరోజు జరిగిన పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర సందర్భంగా.. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి,

## పవన్ కళ్యాణ్‌ని పరామర్శించిన గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



**హైదరాబాద్, సింధూరదర్శిని:** కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ పరామర్శించారు. గవర్నర్ గురువారం ఉదయం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి విచ్చేశారు. ఆయనతో మాట్లాడి శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలని చెప్పారు. త్వరగా కోలు కుని,సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు.

**పవన్ కళ్యాణ్ లైబ్రరీ తిలకించిన జస్టిస్ అబ్దుల్ నజీర్**

పవన్ కళ్యాణ్ స్వగృహంలో ఉన్న లైబ్రరీని గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గారు తిలకించారు. లైబ్రరీలోని పలు పుస్తకాలను పరిశీలించారు. ప్రఖ్యాత రచయితలు, స్కాలర్స్, విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ మేకర్స్ రాసిన పుస్తకాలు పరిశీలించారు. వాటి గురించి పవన్ కళ్యాణ్‌తో ఆసక్తిగా చర్చించారు. పవన్ కళ్యాణ్ కోరడంతో ఓ పుస్తకంపై జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆటోగ్రాఫ్ చేశారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఎంతో ఆప్యాయతతో వచ్చి పరామర్శించినందుకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.



# భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

- పీపీపీ ప్రాజెక్టులతోనే వేగంగా అభివృద్ధి – ప్రతీ ప్రభుత్వ శాఖకూ ఓ ఫైనాన్షియల్ ప్లాన్
- నిరర్థకంగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం
- మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై కేంద్రం ప్రశంసలు
- పీపీపీ–వీజీఎఫ్ పాలసీ 1.0 మార్గదర్శకాలు త్వరలో విడుదల
- పీపీపీ ప్రాజెక్టులు, పీపీపీ విధానంపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, సింధూరదర్శిని:** భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. మిగతా 2లో...

## భారత రైల్వేలో
# నవశకం

- నేడు పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు
- మొట్టమొదటి హైడ్రోజన్ రైలును శుక్రవారం ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- హర్యానాలోని జింద్–సోనిపట్ మార్గంలో పైలట్ ప్రాజెక్టుగా సేవలు
- చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో దేశీయంగా ఈ రైలు అభివృద్ధి



**న్యూఢిల్లీ:** భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిగతా 2లో...

# “గ్లోబల్ ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్



- 17వ ‘ఫుడ్ వరల్డ్ ఇండియా 2026’ సదస్సులో రాష్ట్ర మంత్రి టి.జి. భరత్
- దేశ ఆహార శుద్ధి రంగంలో 9% వాటాతో ఏపీ నంబర్ వన్
- రూ.30,000 కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆహార రంగానికి అవసరమైన ముడిసరుకును అందిస్తూ, అత్యాధునిక సాంకేతికతతో వాటిని శుద్ధి (ప్రాసెస్) చేయడంలో ఆంధ్రప్రదేశ్ ‘గ్లోబల్ ఫుడ్ ప్రాసెసింగ్ హబ్’ గా ఆవిర్భవిస్తోందని రాష్ట్ర భారీ పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ అన్నారు. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక సాంగ్రిల్లా హోటల్‌లో ఫిక్కి, డెలాయిట్ సంయుక్తంగా నిర్వహించిన 17వ ‘ఫుడ్ వరల్డ్ ఇండియా 2026’ జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సు ముఖ్య ఇతివృత్తం ఆయన “స్టెప్ అప్- సామర్థ్యం మరియు లాభదాయకత కోసం విస్తృత రూపాంతీకరణ”ను ఆయన పెట్టుబడిదారులకు లాంగ్-టర్మ్ వృద్ధి భాగస్వామిగా ఏపి అభినందించారు.

**ఆహార రంగమే ఈ దశాబ్దపు అతిపెద్ద అవకాశం:** సదస్సులో మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ, “ప్రస్తుత దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీ వంటి రంగాల గురించి మాట్లాడు కుంటున్నారనీ కానీ ఈ దశాబ్దంలో అత్యంత భారీ ఆర్థిక వ్యాపార అవకాశం మన డైనింగ్ టేబుల్‌పై ఉన్న ‘ఆహారం’ రూపంలోనే ఉందని అన్నారు. నేడు ఆహారం మిగతా 2లో...

## అమరావతి పూర్తయితే లక్ష కోట్ల ఆదాయం

- 175 నియోజకవర్గాల అభివృద్ధికి ఆస్కారం – రాజధాని సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్
- స్థిరం లేని గొడ్డలి పార్టీ నేత మాటలు నమ్మొద్దు – మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, సింధూరదర్శిని:** ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకొంటున్న అమరావతి రాజధాని నగరం పూర్తయితే లక్ష కోట్ల రూపాయల ఆదాయం ఇస్తుందని, రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం ఆయన మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులతో కలసి అమరావతిలో రూపు దాల్చిన ఐకానిక్ భవనాలను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను, అఖిల భారత సర్వీస్ ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి నారాయణ, శ్రీనివాసరావులతో కలిపి మిగతా 2లో...

# న్యూజిలాండ్‌లో భూకంపం... సునామీ హెచ్చరిక జారీ

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరికలు జారీ చేశారు. సముద్రపు అలలు తీరప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు తక్షణమే ఎత్తైన ప్రదేశాలకు లేదా లోతట్టు ప్రాంతాల నుంచి దూరంగా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నడిచి, పరిగెత్తి లేదా సైకిళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియన్, పసిఫిక్ టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులో న్యూజిలాండ్ ఉండటంతో ఇక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. 2011లో సంభవించిన క్రైస్ట్‌చర్చ్ భూకంపం 185 మందిని బలిగొన్న విషయం తెలిసిందే. తాజా భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ప్రధాన ఆస్తి నష్టం గానీ జరిగినట్లు ఇంకా సమాచారం అందలేదని, పరిస్థితిని సమీక్షిస్తున్నామని జాతీయ అత్యవసర నిర్వహణ ఏజెన్సీ (ఎన్ఈఎంఏ) అధికారులు తెలిపారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు–2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు–2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు–2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

# రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 20,700 కోట్లను విడుదల చేసిందని సత్యకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి మరో రూ.30వేల కోట్లు ఇచ్చేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు. ఈ సందర్శన యాత్ర ద్వారా ప్రాజెక్టులోని లోటుపాట్లను గుర్తించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. వైసీపీ అధినేత జగన్ గత ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయినప్పటికీ ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన 80 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన వివరించారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా రాబోయే పది రోజుల్లోనే నీటిని విడుదల చేస్తామని పీవీఎన్ మాధవ్ ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమను సైతం సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులను శరవేగంగా పరుగులు పెట్టించేందుకు సిద్ధమవుతోంది.

# భారత రైల్వేలో నవశకం

(మొదటిపేజీ తరువాయి)

జులై 17న ప్రారంభించనున్నారు. హర్యానాలోని 89 కిలోమీటర్ల జింద్–సోనిపట్ మార్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. పర్యావరణ హిత రవాణా దిశగా భారత రైల్వే వేసిన ఈ అడుగు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ హైడ్రోజన్ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) అభివృద్ధి చేసింది. డీజిల్ ఇంజిన్‌తో నడిచే డెమూ రైలును ఆధునికీకరించి, ఇందులో 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సిస్టమ్‌ను అమర్చారు. ఈ సాంకేతికతలో హైడ్రోజన్, ఆక్సిజన్ కలయికతో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. కేవలం నీటి ఆవిరి మాత్రమే వ్యర్థంగా వెలువడటం వల్ల పర్యావరణ కాలుష్యానికి తావు ఉండదు. పది కోచ్‌లు కలిగిన ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. ఇందులో సుమారు 2,600మంది ప్రయాణించే వీలుంది. టికెట్ ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండేలా రూ. 5 నుంచి రూ. 25 మధ్య నిర్ణయించారు. జింద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక హైడ్రోజన్ ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా ఇంధనాన్ని సరఫరా చేస్తారు. ఇప్పటికే అన్ని రకాల భద్రతా పరీక్షలను పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పాఠశాల విద్యార్థులతో కలిసి కొంత దూరం ప్రయాణించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, దేశవ్యాప్తంగా మరో 35హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ యోచిస్తోంది.

# కంచర్లపాలెం కుంటను పరిశీలించిన తెలుగు గంగ అధికారులు

మైదుకూరు,సింధూరదర్శిని: వనిపెంట ప్రాంతంలోని బ్రహ్మంసాగర్ కాల్వ అనుబంధ కంచర్లపాలెం కుంట నుంచి ఉబికి వస్తున్న నీటి సమస్యను పరిశీలించేందుకు తెలుగు గంగ అధికారులు గురువారం రైతులు, రైతు నాయకులతో కలిసి కుంటను సందర్శించారు.దాదాపు పదేళ్లుగా ప్రతి ఖరీఫ్ సీజన్‌లో కంచర్లపాలెం కుంట నుంచి ఉబికి వచ్చే నీటి కారణంగా సుమారు 3,000 ఎకరాల్లో సాగు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవి. రమణ నాయకత్వంలో బాధిత రైతులు తెలుగు గంగ ప్రాజెక్టు జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారికి వినతి సమర్పించగా, దానికి స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.ప్రాజెక్టు డివిజనల్ ఇంజనీర్ డి.ఈ. రామచంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్ వినయ్ కుమార్ రెడ్డి రైతులతో కలిసి కుంటను పరిశీలించి, సమస్యపై చర్చించారు. కుంట నుంచి ఉబికి వస్తున్న నీటిని నిలువరించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఏవి. రమణ తెలిపారు.

# భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతీ ప్రాజెక్ట వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్ధంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్ధంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతి లోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల వీజీఎఫ్ ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు.

**వచ్చే కేబినెట్‌కు నూతన విధానం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం–వీజీఎఫ్ పాలసీ 1.0ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని... సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

**ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం**

ప్రభుత్వం వద్ద నిరర్ధకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పీపీపీ కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని.. పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

# "గ్లోబల్ ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

(మొదటిపేజీ తరువాయి)

అంటే కేవలం వ్యవసాయం మాత్రమే కాదని అది ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, అంతర్జాతీయ భౌగోళిక వ్యూహాత్మక అంశాలతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆహార ప్రాసెసింగ్ రంగం 8.1 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ కలిగి ఉండగా, అందులో భారత దేశ వాటా 543 బిలియన్ డాలర్లని, కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అందులో 49 బిలియన్ డాలర్లు (దాదాపు 9 శాతం) వాటాను అందిస్తూ దేశంలోనే అత్యధిక రిజిస్టర్డ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కలిగిన రాష్ట్రంగా నంబర్ వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు .

ఆంధ్రప్రదేశ్ – జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాలు:

రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన వ్యవసాయ పర్యావరణ వ్యవస్థను వివరిస్తూ, ఆంధ్రప్రదేశ్ కింది రంగాలలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని మంత్రి ప్రకటించారు:

చేపలు రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల్లో దేశంలోనే నంబర్ వన్.

మిర్చి, నిమ్మ, కోకో, ఆయిల్ పామ్, బొప్పాయి మరియు గుడ్ల ఉత్పత్తిలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం.

బియ్యం, మామిడి, అరటి, మసాలా దినుసుల ఉత్పత్తిలోనూ భారీ వాటా కలిగి ఉందని

ఇది పెట్టుబడిదారులకు కావలసిన ముడిసరుకును భారీ స్థాయిలో అందించగలదని స్పష్టం చేశారు.

"ఇండియా పండించడానికి సిద్ధం – ఆంధ్రప్రదేశ్ ప్రాసెస్ చేయడానికి సిద్ధం":

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టిని ప్రస్తావిస్తూ, రైతుల సమీపంలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రాసెసింగ్ జరిగినప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, యువతకు ఉపాధి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన "భారతదేశం ప్రపంచానికి ఆహారం అందించాలని భావిస్తే... దానిని ప్రాసెస్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ సర్వసన్నద్ధంగా ఉందన్నారు. ఇకపై రాష్ట్రం కేవలం పంటలు పండించడానికే




పరిమితం కాదని, ప్రాసెసింగ్ రంగంలో ప్రపంచ బ్రాండ్‌గా మారుతుందని పేర్కొన్నారు.

**'ఈజ్ ఆఫ్ డూయింగ్' కాదు... 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'**

రాష్ట్రంలో కేవలం సులభతర వాణిజ్యం మాత్రమే కాకుండా, ఒక అడుగు ముందుకు వేసి వేగవంతమైన వాణిజ్యం వైపు అడుగులు వేస్తున్నామని మంత్రి తెలిపారు. పెట్టుబడిదారులు అనుమతుల చుట్టూ తిరగడం కాకుండా, వేగంగా ఉత్పత్తిని ప్రారంభించినప్పుడే లాభాలు వస్తాయని, అందుకోసమే సింగిల్ డెస్క్ అనుమతులు, ప్రత్యేక ప్రాజెక్ట్ హ్యాండ్–హోల్డింగ్ వేగవంతమైన నిర్ణయాలు మా ప్రభుత్వ పనితీరు విధానమని స్పష్టం చేశారు.

**రూ. 30,000 కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాలే లక్ష్యం:**

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో సాధించిన ప్రగతి మౌలిక వసతులను మంత్రి వివరిస్తూ..

మౌలిక సదుపాయాలు: రాష్ట్రంలో 1,000 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, 6 కార్యాచరణ రేవులు, 7 విమానాశ్రయాలు, 24x7 నాణ్యమైన విద్యుత్ మరియు 9 ప్లగ్–అండ్–ప్లే ఫుడ్ పార్కులు అందుబాటులో ఉన్నాయన్నారు.

భారీ నిల్వ సామర్థ్యం: 17.20 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఆధునిక కోల్డ్ స్టోరేజ్, 33.52 లక్షల మెట్రిక్ టన్నుల వేర్‌హౌసింగ్ వసతులు సిద్ధంగా ఉన్నాయన్నారు.

భారీ పెట్టుబడులు: గత రెండేళ్లలో రూ. 11,800 కోట్ల విలువైన 29 మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాం అన్నారు. ఇందులో రిలయన్స్ కన్స్యూమర్, గోద్రెజ్ ఆగ్రోవెట్, మదర్ డెయిరీ, 3ఫ్ ఆయిల్ పామ్, ఐటిసి, స్నేహా ఫార్మ్స్, ఐబి గ్రూప్, హంగ్యో ఐస్‌క్రీమ్స్ వంటి దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టాయన్నారు. పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో మరో 30 కంపెనీలతో రూ. 8,000 కోట్ల ఒప్పందాలు (వీశీఖం) జరిగాయని తెలిపారు.

లక్ష్యాలు: నూతన ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ద్వారా రూ. 30,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా 3 లక్షల కొత్త ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు.భవిష్యత్తులో ఆహార ప్రాసెసింగ్ రంగం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), ప్రిసిషన్ అగ్రికల్చర్, డిజిటల్ సప్లై చైన్, స్మార్ట్ లాజిస్టిక్స్ ఆధారంగా నడుస్తుందని, టెక్నాలజీ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి మద్దతు ఇస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ పెట్టుబడిదారులకు పిలుపునిస్తూ... ఆంధ్రప్రదేశ్‌ను కేవలం ఒక గమ్యస్థానంగా చూడకుండా, మీ దీర్ఘకాలిక వృద్ధి భాగస్వామిగా (+తీశీష్ట్రఙ్ఖతీఅవతీ) చూడాలని, "మీ విజయమే మా విజయం" అంటూ ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అమరావతి పూర్తయితే లక్ష కోట్ల ఆదాయం

(మొదటిపేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. అమరావతిపై గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీ ఇతర నేతలు చేస్తున్న విష ప్రచారాన్ని మంత్రి రామానాయుడు ఖండించారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతి రాజధానిని స్వాగతిస్తున్నానని, 30,000 ఎకరాలు సరిపోవని, తాను ఇక్కడ ఇల్లు కట్టుకుంటున్నానని, అమరావతి రాజధాని కదిలే ప్రసక్తి లేదని జగన్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాలను రామానాయుడు గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే, మాట మార్చి, మడమ తిప్పి మూడు రాజధానులు అంటూ, మూడుముక్కలాట ఆడాడని విమర్శించారు. తాను ప్రతిపాదించిన మూడు రాజధానుల లో మూడు ఇటుకలు కూడా పెట్టకుండా ఐదేళ్ళు కాలయాపన చేశాడన్నారు. పదవిపోయి పదకొండు సీట్లు కే పరిమితమైనా, ఇప్పుడు మళ్లీ మాట మార్చి మావిగన్ అంటూ మతిస్థిరం లేని మాటలు మాట్లాడుతున్నాడని దుయ్య బట్టారు. ఆ పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విజయవాడ రాజధాని అంటున్నారు. పెద్దిరెడ్డి 30 రాజధానులు అంటున్నారు. ఇలా ఆ గొడ్డలి పార్టీకి రాజధాని విషయంలో వాళ్లలో వాళ్లకే క్లారిటీ లేదని రామానాయుడు విమర్శించారు. పిచ్చి తుగ్లక్ సైతం, అసూయ, ఆశ్చర్య పోయేలా అమరావతి పై గొడ్డలి పార్టీ నాయకుడు మాట్లాడుతున్నాడన్నారు. కర్ణాటకకు బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణాకు హైదరాబాద్ నుండి 70 శాతం ఆదాయం అందిస్తున్నట్లే, ఆంధ్రప్రదేశ్ కు అమరావతి ఆదాయం ఇస్తుందన్నారు. అమరావతి రాజధాని వైఖరిలో జగన్ తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. సచివాలయం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సుమారు 16,000 మంది ఒకేచోట పని చేసే విధంగా 5 ఐకానిక్ టవర్లు డిజైన్ చేశారన్నారు. ప్రపంచం లోనే అత్యంత పొడవైన సెక్రటేరియట్ భవనంగా 204 మీటర్లు ఎత్తుతో నిర్మిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే సచివాలయం, హెచ్ఓడి టవర్లు ఒకే చోట మెదటి సారిగా నిర్మిస్తున్నది మన రాష్ట్రంలోనే అని రామానాయుడు కొనియాడారు.దేశంలోనే మొదటి డయాగ్రిడ్ బిల్డింగ్, లోపల ఎటువంటి పిల్లర్లు, లేకుండా, తుఫాన్ లు, వంటి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునేలా నిర్మిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లకు 12 టవర్లలో 276 ప్లాట్స్ 90శాతం నిర్మాణం పూర్తయ్యాయని మున్సిపల్ మంత్రి నారాయణ నిమ్మలకు, పల్లాకు చూపించారు. అల్ ఇండియా సర్వీస్ అధికారులకు 6 టవర్ల తో 138 ప్లాట్స్ 95 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని నారాయణ సహచరులకు వివరించారు. చంద్రబాబు నాయకత్వం లో ప్రపంచ స్థాయిలో ప్రజా రాజధాని నిర్మిస్తున్నామని మంత్రులిద్దరూ, పల్లా శ్రీనివాసరావు చెప్పారు. సీడ్ యాక్సెస్ రోడ్ కోసం మొత్తం 45.47 ఎకరాలకు గాను, 99.5 శాతం మంది రైతులు నుండి భూమిని సమీ కరించామన్నారు. ఇంకా కేవలం 1.52 ఎకరాలు మాత్రమే భూ సమీకరణ ద్వారా రావలసి ఉందని ఇది కేవలం 0.5% మాత్రమేనని రామానాయుడు చెప్పారు. కేవలం ఒకరో, ఇద్దరో రైతులు రాజకీయ దురుదేశ్యం తో భూములు ఇవ్వకుండా అడ్డు పడుతున్నారని ఆయన అన్నారు.



# గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

### కాకొల్లువారిపల్లెలో రోడ్డు ప్రారంభోత్సవంలో

### నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

### స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపు

ఉదయగిరి (సింధూరదర్శిని)16 జూలై నెల్లూరుజిల్లా; ఉదయగిరి నియోజక వర్గాన్ని అభివృద్ధి, ఉపాధి అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు భారీ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం వరికుంటపాడు మండలం కాకొల్లువారి పల్లెలో రూ.1.67కోట్లతో నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవంలో ఎంపీ మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అయితే అభివృద్ధి అంటే కేవలం రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని, విద్య, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో ప్రగతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతు న్నాయని తెలిపారు.దుత్తలూరు ప్రాంతంలో డిఫెన్స్ అమ్మునిషన్ క్లస్టర్‌లో భాగంగా సుమారు రూ.2,245కోట్ల పెట్టుబడులతో ఐదు పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగు తోందన్నారు. ఏడాదిలోపే పరిశ్రమల నిర్మాణ పనులు ప్రారంభమై స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతా లకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ఎలాంటి విభేదాలు ఉన్నా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంతో పాటు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన. ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఢిల్లీ పర్యటనల్లో సైతం రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర మంత్రులతో గంటల తరబడి సమావేశాలు నిర్వహిస్తూ నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని ఎంపీ కొనియాడారు.ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన భాష్యం రామకృష్ణకి కాకొల్లువారిపల్లెలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజా జీవితంలో మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెలుగు దేశం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ పాల్గొన్నారు.

**అమ్మవారి దర్శనం**

నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానాన్ని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఎంపీ కి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

## నేడు ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు( సింధూర దర్శిని) 16 జూలై నెల్లూరు జిల్లా ; ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ ను నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధిపతులు తమ శాఖలలోని ఉద్యోగులు మరియు ఉద్యోగ సంఘాలకు ఈ విషయాన్ని తెలియజేసి, ఉద్యోగులు తమ వినతులు/ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సమక్షంలో సమర్పించుకునేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కోరడమైనది. అలాగే, గతంలో స్వీకరించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికలతో ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.







# పల్లె వీక్షణ అర్జీలకు 30 రోజుల్లో పరిష్కారం

### ప్రతి సమస్య పరిష్కారమే పల్లె వీక్షణ లక్ష్యం

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

### పులికల్లులో కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటన

### గ్రామస్తుల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపిన కలెక్టర్, ఎమ్మెల్యే

పొదలకూరు ( సింధూర దర్శిని) 16 జూలై నెల్లూరు జిల్లా; జిల్లాలో వినూత్నంగా నిర్వహిస్తున్న "పల్లె వీక్షణ" కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న అర్జీలను 30 రోజుల్లో పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు.గురువారం పొదలకూరు మండలం పులికల్లు గ్రామంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ పల్లె వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

తొలుత ఎమ్మెల్యేతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్, పులికల్లు గ్రామ సమీపంలో చేపడుతున్న వీబీజీ-రాంజీ ఉపాధి హామీ పనులను పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మమేకమై వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. తాగునీటి నాణ్యతను పరిశీలించి, గ్రామంలో మినీ గోకులాన్ని ప్రారంభించారు.

**గ్రామస్తులతో ముఖాముఖి... అర్జీల స్వీకరణ**

అనంతరం జిల్లాస్థాయి అధికారులతో కలిసి గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. అందిన ప్రతి అర్జీని వెంటనే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు వివరించిన సమస్యలను క్షుణ్ణంగా ఆలకించి, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు.

**గ్రామ సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం**

పర్యటన సందర్భంగా గ్రామస్తులు ప్రస్తావించిన అనేక సమస్యలకు కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే పరిష్కారం చూపించారు. గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరు చేయాలని కోరగా వెంటనే ఆమోదించారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు సమయాన్ని అరగంట ముందుకు మార్చాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పశువుల సంరక్షణ కోసం మినీ గోకులాలు మంజూరు చేయాలని పాడి రైతులు కోరగా వెంటనే 10 గోకులాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గ్రామానికి ప్రతి వారం 104 వైద్య సేవలు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.తమ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్ గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించడంపై గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రతి సమస్య పరిష్కారమే పల్లె వీక్షణ లక్ష్యం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నూటికి నూరు శాతం సమర్థవంతంగా అమలవుతున్నాయా? అర్హులందరికీ అందుతున్నాయా? అనే విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించడమే "పల్లె వీక్షణ" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకుని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.పల్లె వీక్షణలో అందిన ప్రతి అర్జీని ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, నెల రోజుల్లో పరిష్క రించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పులికల్లు గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలు సంతృప్తికరంగా ఉందన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు, వీబీజీ-రాంజీ పనుల పురోగతి ప్రశంసనీయంగా ఉన్నాయని పేర్కొన్నారు.

త్వరలోనే అన్ని కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగం లోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోని సమస్యలు కార్యాలయాలకు చేరుకోవడంలో కొంత జాప్యం జరుగుతుందని, కానీ క్షేత్రస్థాయిలో పర్యటించి నప్పుడు ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలిసి వెంటనే పరిష్కారం చూపే అవకాశం ఉంటుందని చెప్పారు. పులికల్లు గ్రామంలో గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పల్లె వీక్షణ నిర్వహించినప్పుడు పరిధి లోని అన్ని గ్రామాల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్క రించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

**ప్రజల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక చొరవ అభినందనీయం**

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో ప్రారంభించిన పల్లె వీక్షణ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తుండటం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ-సర్వే కారణంగా నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సమస్యలు తలెత్తాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. కందులేరు జలాశయం మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో పాటు చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు కూడా నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే సర్వేపల్లి జోసఫ్‌పేట, అంకుపల్లి మెయిన్ స్కూల్‌ల మార్పిడి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉన్నతి పథకం ద్వారా లబ్ధిదారులకు రుణాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ఆర్డీఓ అనూష, డీపీఓ వసుమతి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ ఎస్ఈలు కోటేశ్వరరావు, రాఘవేంద్రన్, పశు సంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్, జడ్పీ డిప్యూటీ సీఈవో బ్రహ్మయ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ ముందంజ

### ప్రకృతి, వినోదం, అడ్వెంచర్ - అన్నీ ఒకే చోట

### సింగపూర్ నిపుణుల సలహాలతో కొత్త రూపంలో తిరుపతి జూ జంతువులకు

### రక్షిత నీటి సరఫరా - భవిష్యత్తు ప్రణాళికలు

### ఆంధ్రప్రదేశ్ వన్య ప్రాణులు,పర్యావరణ కమిటీ ఛైర్మన్, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

### తిరుపతి జూ పార్క్ - సుస్థిర ఆదాయ వనరుల వైపు అడుగులు

### పునుగు పిల్లుల విశిష్టత - యాత్రికులకు కొత్త అనుభవం: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి (సింధూర దర్శిని) 16 జూలై తిరుపతి జిల్లా ; తిరుపతి ఎస్ వి జూ పార్కు అభివృద్ధికి అన్నీ విధాల సహకారం అందించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ వన్య ప్రాణులు, పర్యావరణ కమిటీ ఛైర్మన్ మరియు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని వి సి హాల్ నందు వన్య ప్రాణులు, పర్యావరణ పరిరక్షణ లో భాగంగా గురువారం తిరుపతి ఎస్ వి జూ పార్క్ అభివృద్ధి పై తీసుకోవలసిన చర్యల పై ఆంధ్రప్రదేశ్ ఆంధ్ర ప్రదేశ్ వన్య ప్రాణులు, పర్యావరణ కమిటీ ఛైర్మన్ మరియు అసెంబ్లీ స్పీకర్ జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, జనరల్ సెక్రెటరీ లెజిస్లేచర్ ప్రసన్న కుమార్ సూర్యదేవరలతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కమిటీ మెంబర్‌లు తిరుపతి, చంద్రగిరి, శ్రీకాకుళం, బాపట్ల ఎంఎల్ఏ లు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గోండు శంకర్, వి.నరేంద్రవర్మ, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్, జేసి ఆర్. గోవిందరావు, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్ లైఫ్ మరియు హెచ్ ఆర్ డి నాగేశ్వర రావు, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తిరుపతి సర్కిల్ వై . శ్రీనివాసులు, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సోషల్ ఫారెస్టరీ మరియు జూ పార్క్స్ బి ఎన్ ఎన్ మూర్తి, డిఎఫ్ఓ సాయిబాబా, డిఆర్ఓ జి. నరసింహులు, స్టేట్ సిల్వికల్చరిస్ట్, బయో ట్రిమ్ ఎం. బబిత, డివిజినల్ ఫారెస్ట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వన్య ప్రాణులు, పర్యావరణ కమిటీ ఛైర్మన్ మరియు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రగతిశీల రాష్ట్రం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చాలా తక్కువ రాష్ట్రాలలో మాత్రమే ఉన్న వన్య ప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీని చట్ట సభల ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ద్వారా తిరుపతి ఎస్ వి జూలాజికల్ పార్క్‌ను సందర్శి ంచడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో విశాఖపట్నం, తిరుపతి లలో జూ పార్క్ లు ఉన్నాయని, తిరుపతి ఎస్వి జూ పార్క్ 3100 ఎకరాలలో ఏర్పాటు చేయబడి విస్తరణ పరంగా ఆసియాలో అతిపెద్ద జూపార్క్‌గా పేరుగాంచినద న్నారు. ఎస్వి జూ పార్క్ అభివృద్ధికి దాదాపు రూ.6 కోట్లు అవసరం అవుతుందన్న అంచనా ఉందని, ఇందులో రూ.3కోట్లు టిటిడి నుండి సమీకరించడం జరుగుతు ందని, మిగిలిన రూ.3 కోట్లను జిల్లా కలెక్టర్ సి ఎస్ ఐ ఆర్ నిధుల ద్వారా సేకరించవలసి ఉందన్నారు. వీటి తో పాటు ఎం ఎల్ ఏ లు, లోక్ సభ సభ్యుల ద్వారా మరింత నిధులు సమకూర్చే ప్రయత్నం చేస్తానన్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ సుమారు 95 వేల మంది భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుపతికి వస్తున్నారని, ఇందులో సరాసరి 4 శాతం యాత్రికులు మాత్రమే ఎస్వి జూ పార్క్ ను సందర్శిస్తున్నారని, కనీసం 8 శాతం మంది యాత్రికులు ప్రతి రోజూ ఎస్వి జూ పార్క్ ను సందర్శించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జూ పార్క్ లో అనుమతించిన మేర అడ్వెంచర్, ఎంటర్టైన్మెంట్ ఉండేలా చూడాలని తెలిపారు. జూ పార్క్ చుట్టూ 13 కి.మీల మేర కాంపౌండ్ వాల్ పడిపోయిందని, కాంపౌండ్ వాల్ పునర్నిర్మాణం చేయుటకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. విశాఖపట్నం, తిరుపతి జూ పార్క్ ల అభివృద్ధికి అవసరమైన నిధులను బడ్జెట్ ద్వారా కేటాయింపుకు కృషి చేస్తామన్నారు. తిరు పతి జూ పార్క్ కు కళ్యాణి డ్యామ్ నుండి నీటి కేటాయి ంపులు చేయుటకు ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, వీటి అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. జంతువులకు అవసరమైన రక్షిత నీటి సరఫరాకు ఫిల్టర్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విశాఖపట్నం జూ పార్క్ అభివృద్ధికి సింగపూర్ నుండి నిపుణుల బృందం రానున్నదని, వీరి ద్వారా తిరుపతి జూ పార్క్ అభివృద్ధికి అవసరమైన ఆలోచనలను సమకూర్చుకోవాలని సూచిం చారు. తిరుపతి జూ పార్క్ లో మంజూరైన పోస్ట్ ల భర్తీకి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ తిరుపతి జూ పార్క్ అభివృద్ధికి అవసరమైన నిధులను సమీకరించడంతో పాటు సుస్థిర ఆదాయ వనరుల ఏర్పాటు, నిధుల సద్వినియోగం పై చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. తిరుమల శ్రీవారికి కొన్ని విశిష్టమైన జంతువులతో ఉన్న అనుబంధాన్ని యాత్రికులకు అవగాహన కల్పించాలని, పునుగు పిల్లులు వంటి జంతువుల విశిష్టతను ప్రజలకు తెలియజేయడం, ఎర్ర చందనం ఎక్స్పీరియన్స్ సెంటర్, ఎర్ర చందనం ఉత్పత్తుల సేల్స్ సెంటర్ ను ఏర్పాటు చేయడం ద్వారా మరింత మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉందన్నారు. జంతువులకు ఎటువంటి ఇబ్బందిలేని విధంగా పిల్లలకు అడ్వెంచర్, ఎంటర్టైన్మెంట్ పార్క్ లు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామన్నారు. ఆర్ టి సి బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ నుండి కొన్ని ప్రత్యేక బస్సులను నడపడం ద్వారా కూడా సందర్శకులు





# కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సంక్షేమం

**రెండేళ్లలో నాయుడుపాళెంకు రూ.1 కోటికి పైగా అభివృద్ధి, సంక్షేమం**

**కొబ్బరికాయ కొట్టి వదిలేసే రకం కాదు.. గుమ్మడికాయ కొట్టి ప్రారంభోత్సవాలు జరిపే ప్రభుత్వం మనది**

**నాయుడుపాళెంలో రూ.50 లక్షల బి టి రోడ్డు, రూ.21 లక్షల సీసీ రోడ్ల ప్రారంభోత్సవం**

**రాష్ట్రంలో పి ఎం జి ఎస్ వై అమలులో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే 2వ ర్యాంక్ రావడం గర్వకారణం**

**కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

నెల్లూరు (సింధూర దర్శిని) 16 జూలై నెల్లూరు జిల్లా ; గత ప్రభుత్వం పనులకు కొబ్బరికాయలు కొట్టి అర్థాంతరంగా వదిలేస్తే.. ఆ పనులన్నింటినీ పూర్తి చేసి, గుమ్మడికాయలు కొట్టి ప్రారంభోత్సవాలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కొడవలూరు మండలం నాయుడుపాళెం పంచాయతీలో రూ.50 లక్షల ఎన్ ఆర్ జి ఈ ఎస్ నిధులతో పూర్తయిన 1.5 కిలోమీటర్ల బి టి రోడ్డును, రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన 4 సీసీ రోడ్లను ఆమె స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన ఈ స్వల్ప కాలంలోనే కేవలం నాయుడుపాళెం పంచాయతీలోనే సుమారు రూ. 1 కోటికి పైగా అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టాం. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎంత అస్తవ్యస్తం చేసినా, వాటన్నింటినీ సరిదిద్దుకుంటూ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. గత హయాంలో కోవూరు నియోజకవర్గంలో ఒక తట్ట మట్టి కూడా వేయని పరిస్థితి ఉంటే.. నేడు ప్రతి గ్రామం బాగుండాలని రోడ్లు వేస్తున్నామని చెప్పారు.

**రోడ్ల నాణ్యతలో రెండో స్థానంలి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం అమలులో, రహదారుల నాణ్యతా ప్రమాణాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే 2వ స్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమన్నారు. నాయుడుపాళెంలో మిగిలిన 1.10 కిలోమీటర్ల రోడ్డును కూడా రూ.40 లక్షల అంచనా వ్యయంతో త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కిసాన్ సెజ్‌కు మళ్లీ ఊపిరి కోవూరు నియోజకవర్గంలో దాదాపు రూ.770 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించిన చంద్రబాబు నాయుడు కి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నామని ప్రశాంతి రెడ్డి అన్నారు. దాదాపు 30 ఏళ్లుగా మూలన పడిన కొడవలూరు కిసాన్ సెజ్ వ్యవహారంలో యువనేత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో కదలిక వచ్చిందని, త్వరలోనే ఇక్కడ పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందించి వారి భూములకు శాశ్వత రక్షణ కల్పించాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో యూరియా పంపిణీ చేసి, ధాన్యం కొనుగోళ్లతో పాటు రైతులకు వెంటనే చెల్లింపులు జరిపి ఆదుకున్నాం. పేదల వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోవూరు నియోజకవర్గంలోనే వెయ్యి మందికి పైగా లబ్ధిదారులకు దాదాపు రూ.10 కోట్ల విలువైన చెక్కులను అందించామని చెప్పారు.

**స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం**

రాష్ట్రంలో ఓటర్ల నమోదు ప్రక్రియ గడువు పొడిగించినందున, అర్హులైన వారందరూ తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని, అవసరమైన వారికి స్థానిక కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది సహాయం చేయాలని కోరారు. త్వరలో రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో నాయకులంతా ఐకమత్యంతో నిలబడి అన్ని స్థానాల్లో కూటమి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఒక నాయకుడితో సమానమని, నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. తమకు ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి కలవవచ్చని, ఎలాంటి సంకోచం లేకుండా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి భరోసా ఇచ్చారు.



## ఉచిత వైద్య పరీక్షలు

**ఉచిత వైద్య పరీక్షలు ఆలయ ఈవో**

**పెంచల కిషోర్ చేతుల మీదుగా ప్రారంభం**

కాణిపాకం ( సింధూర దర్శిని) 16 జూలై చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం ఆస్థానం మండపం నందు డాక్టర్ మోహన్స్ డయాబెటిక్ స్పెషల్ కేర్ వారి ఆధ్వర్యంలో గురువారం దేవస్థానంలో పనిచేయు సిబ్బందికి, మరియు పరిసర గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు, మెడికల్ పరీక్షలు నిర్వహించడం జరిగింది, మొదటిగా దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్వి కృష్ణారెడ్డి, డాక్టర్లు అంజన, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

## గణపయ్య సేవలో హ్యూమన్ రైట్స్ కమిషన్ జాయింట్ డైరెక్టర్



కాణిపాకం( సింధూర దర్శిని) 16 జూలై చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ జాయింట్ డైరెక్టర్ దేవేంద్ర కుమార్ నిమ్ , స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో సూపరెంటెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, కాణిపాకం ఎస్సై, తదితరులు పాల్గొన్నారు.

# అవిలాల బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**హాథీరాంజీ మఠం భూములు - కొచ్చి కుటుంబ భూములపై సమగ్ర సర్వే అనంతరం న్యాయబద్ధమైన నిర్ణయం**

**బాధితుల అభిప్రాయాలకు ప్రాధాన్యం... పారదర్శకంగా పరిష్కారం**

**రెండు నెలల్లో అవిలాల బాధితుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



తిరుపతి (సింధూర దర్శిని) 16 జూలై తిరుపతి జిల్లా ; అవిలాల గ్రామానికి సంబంధించిన దశాబ్దాల నాటి భూ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి తొందరపాటు నిర్ణయాలకు తావులేకుండా, చట్టబద్ధంగా, పారదర్శకంగా, అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా పరిష్కారాన్ని అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు.అవిలాల గ్రామ భూ సమస్యలపై జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో జిల్లాకలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) రామ్మోహన్, రెవెన్యూ, ఎండోమెంట్స్ శాఖల అధికారులు, కొచ్చి కుటుంబ ప్రతినిధులు, అవిలాల గ్రామ బాధితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పెండింగ్ భూ సమస్యలకు ప్రాధాన్యం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఆ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలో సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.ఎండోమెంట్స్ శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే అవిలాల భూ సమస్యపై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయి అధ్యయనం ప్రారంభించిందన్నారు. గతంలో ఇది ఎండోమెంట్స్ శాఖ, రెవెన్యూ శాఖ, ప్రైవేటు పట్టాదారుల మధ్య వివాదాస్పద అంశంగా ఉండటంతో అన్ని శాఖల అభిప్రాయాలు, న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.22-ఏ సమస్యల పరిష్కారంలో తిరుపతి జిల్లా ఆదర్శంగా నిలుస్తోంది

జిల్లాలో 22-ఏ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. భూములు కొనుగోలు చేసిన వేలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్, క్రయ విక్రయాలు చేయలేక ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.శెట్టిపల్లి ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాలుగా కొనసాగిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి 2,100 మంది లబ్ధిదారులకు 225 ఎకరాలపై ఇంటి స్థలాల పట్టాలు, ఉచిత రిజిస్ట్రేషన్ పత్రాలు అందించామని తెలిపారు. ప్రస్తుతం అక్కడ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, భవిష్యత్తులో ఆ ప్రాంత భూముల విలువ గణనీయంగా పెరిగి ప్రజల ఆస్తి విలువ మరింత పెరుగుతుందని చెప్పారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రజలకు న్యాయం

దామినేడు ప్రాంతంలో ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ న్యాయస్థానాల్లో ప్రభుత్వం విజయాన్ని సాధించిందన్నారు. సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని అంతర్జాతీయ క్రీడా సముదాయం, జిల్లా కోర్టు సముదాయం, పర్యాటక అభివృద్ధి వంటి ప్రజా అవసరాలకు కేటాయించినట్లు వివరించారు.అదే సమయంలో దామినేడు ప్రాంతంలో 240 ఎకరాలకు సంబంధించిన మరో సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, సుమారు 1,400మంది కొనుగోలుదారులకు సంబంధించిన భూములను 22-ఏ నుంచి విముక్తి కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఆటోనగర్ ప్రాంతంలో కూడా 22-ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న సుమారు 500 కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేస్తూ విముక్తి కల్పించిందన్నారు.

**అవిలాల సమస్యపై సమగ్ర సర్వే**

అవిలాల భూ సమస్యపై మాట్లాడుతూ, 1884 కాలం నుంచి జరిగిన భూ లావాదేవీలు, న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వ రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.ఉత్తరాది మఠం, హాథీరాంజీ మఠం, కొచ్చి కుటుంబానికి సంబంధించిన భూములపై ఎండోమెంట్స్ శాఖ మార్గదర్శకాల మేరకు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.సుమారు 175 ఎకరాల పరిధిలో హాథీరాంజీ మఠానికి చెందిన భూములకు సంబందించిన,కొచ్చి కుటుంబానికి చెందిన భూములు సంబందించిన అంశాన్ని ఖచ్చితంగా నిర్ధారించిన తర్వాత చట్టబద్ధమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

హాథీరాంజీ మఠానికి చెందిన భూములను పూర్తిగా పరిరక్షిస్తూనే, కొచ్చి కుటుంబానికి సంబంధించిన భూముల విషయంలో చట్టపరంగా 22-ఏ నుంచి విముక్తి కల్పించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు.

**ప్రజల అభిప్రాయాలకే ప్రాధాన్యం**

ఈ సమస్యను అధికారులు కార్యాలయాల్లో కూర్చొని నిర్ణయించే ఉద్దేశం తమకు లేదని, బాధితుల అభిప్రాయాలు తెలుసుకుని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.అవిలాలలో అనేక మంది తమ జీవితకాల పొదుపులతో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, వారి ఇబ్బందులను ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకుందని చెప్పారు. ఎవరికి అన్యాయం జరగకుండా, అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి శాశ్వత పరిష్కారం తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

**జీపీఏ కొనుగోలుదారుల సమస్యలూ పరిష్కరిస్తాం**

సమావేశంలో సుమారు 20 మంది బాధితులు తమ అభిప్రాయాలు వెల్లడించారని, అందరి సమస్యలను ఓర్పుతో విన్నామని తెలిపారు.రైతుల నుంచి జీపీఏ ఆధారంగా భూములు కొనుగోలు చేసిన వారి సమస్యలు కూడా ప్రభుత్వ దృష్టిలో ఉన్నాయని, వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే ముందుగా అసలు బాధితుల సమస్యకు పరిష్కారం చూపి, అనంతరం జీపీఏ కొనుగోలుదారుల అంశాన్ని కూడా చట్టబద్ధంగా పరిష్కరిస్తామని వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సంబంధిత భూముల్లో 50 శాతం హాథీరాంజీ మఠానికి, 50 శాతం కొచ్చి కుటుంబానికి చెందినవిగా గుర్తింపు ఉన్న నేపథ్యంలో అదే ప్రాతిపదికన తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

**న్యాయపరమైన కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

సామాన్య ప్రజలపై ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న కేసులు మంచిది కాదని, వాటి వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ అంశంపై జిల్లా ఎస్పీతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, న్యాయపరమైన కేసులు, శాంతిభద్రతల అంశాలను సమన్వయంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**రెండు నెలల్లో పరిష్కారానికి ప్రభుత్వం కృషి**

అవిలాల బాధితుల సమస్యను రెండు నెలల్లో పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, ఈ విషయాన్ని సభాముఖంగా హామీ ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు.

**కొచ్చి కుటుంబం స్పందన**

ఈ సందర్భంగా కొచ్చి కుటుంబానికి చెందిన కోచ్చి శేషగిరిరావు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

44 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇది కేవలం తమ కుటుంబ సమస్య మాత్రమే కాదని, అక్కడ ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న ప్రజలు, అగ్రిమెంట్ హోల్డర్లు, తెలియక భూములు కొనుగోలు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారందరికీ న్యాయం జరగాలని ఆకాంక్షించారు. ఎండోమెంట్స్ కమిషనర్ ఉత్తర్వులు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సంబంధిత భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరారు.సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించిన బాధితులందరికీ జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, రెవెన్యూ, ఎండోమెంట్స్ శాఖల అధికారులు, అవిలాల గ్రామ బాధితులు, కొచ్చి కుటుంబ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


# రాష్ట్రపతి ఉత్తర్వు 2025 & ఉద్యోగ కల్పన (జాబ్ క్యాలెండర్)పై ప్రత్యేక సిఎస్ జిఏడి వీక్షణ సమావేశం





బాపట్ల సింధూరదర్శిని:
ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ 2025 లోని నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని ప్రశాంతమైన వాతావరణంలో సిబ్బంది కేటాయింపు చేయాలని సాధారణ పరిపాలన సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్ష సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా నుండి జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, పరిపాలన అధికారి మల్లికార్జున్ లతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశం మందిరం నుండి హాజరైనారు. ఈ సందర్భంగా సాధారణ పరిపాలన శాఖ సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వులు అనుగుణంగా పాత, కొత్త జిల్లాలకు సిబ్బంది కేటాయింపులో మార్గదర్శకాల మేరకు సిబ్బంది కేటాయింపు జరగాలని, రాష్ట్రపతి ఉత్తర్వులు 2025 అమలులో భాగంగా నిర్దేశిత ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లాలలో పట్టాదారు పాస్ పుస్తకాల ముద్రణ, పంపిణీ, ఈకేవైసీలు నిర్దేశిత మాసాల లక్ష్యాలను పూర్తిచేయాలని సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి మాట్లాడుతూ, సిబ్బంది కేటాయింపులో పాత జిల్లాల కలెక్టర్లతో చర్చించి సిబ్బంది సీనియారిటీ విషయంలో తగు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

# క్రెడిట్ ఔట్రీచ్ ప్రోగ్రాం విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే అరవింద బాబు



నరసరావుపేట, సింధూరదర్శిని:
నరసరావుపేటలో ఈ నెల 17న నిర్వహించనున్న ప్రతిష్టాత్మక క్రెడిట్ ఔట్రీచ్ ప్రోగ్రాం-భారీ రుణమేళా విజయవంతం కావాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురువారం స్థానిక శ్రీ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కార్యక్రమం విజయవంతంగా జరిగి, అర్హులైన లబ్ధిదారులకు పెద్ద ఎత్తున రుణాలు అందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం నరసరావుపేటలోని సభా వేదిక ప్రాంగణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమా నికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. సభా ప్రాంగణంలో చేపట్టిన ఏర్పాట్లను ఆర్డీఓతో కలిసి పరిశీలించి, తాగునీరు, పారిశుధ్యం, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, భద్రత తదితర అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. తదనంతరం ఇస్సపాలెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను ఎమ్మెల్యే అరవింద బాబు పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాకకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు అన్ని ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలనిసూచించారు. నరసరావుపేటలో నిర్వహించనున్న ఈ క్రెడిట్ ఔట్రీచ్ ప్రోగ్రాం ద్వారా వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు భారీస్థాయిలో రుణాలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానుండటంతో జిల్లా వ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

# అంగళ్లులో అడ్రస్ లేని జి.శంకర్‌కు ఇన్చార్జి పదవా?

### పార్టీని పనిగట్టుకొని ఓడించిన వారికి పట్టం కట్టాలనే చూస్తే పార్టీ అధోగతే - టిడిపి నాయకుల ఏకగ్రీవ తీర్మానం




బి.కొత్తకోట సింధూరదర్శిని: అంగళ్లు ఘటనలో నాడు చంద్రబాబు పై వైసిపి మూకలు దాడి చేసి అనేక మంది టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టీ జైలుకి పంపిస్తే అడ్రస్ లేని మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌కి ఇంచార్జి పదవి కట్టబెట్టాలని చూస్తే నియోజకవర్గంలో టీడీపీ నామరూపాలు ఉండవని పలువురు టీడీపీ సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బి. కొత్తకోటలో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె అసెంబ్లీ ఎన్నికల్లో నేడు ఇన్చార్జి పదవి కావాలని వస్తున్న జి.శంకర్, కోవర్టులు కుట్రలు, కుతంత్రాలు చేసినా 50వేల మెజారిటీని 10000 తగ్గించిన జయచంద్రారెడ్డి పదవి లేకపోయినా నిరంతరం ప్రజల సమస్యల కోసం కృషి చేసినట్లు చెప్పారు. నాడు నేటి సీఎం చంద్రబాబు అంగళ్లు పర్యటనలో అడ్రస్ లేని జి.శంకర్ యాదవ్ తో బాటు అతని అనుచరుల పై ఒక్క కేసు లేదని అప్పట్లో మాపై వైకాపా పెట్టిన అక్రమ కేసులు ఎదుర్కొని అన్ని రకాలుగానష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళు గా కార్యకర్తలను పట్టించుకోకపోగా గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ తెదేపా ను భూస్థాపితం చేయడానికి కంకణం కట్టుకున్నట్లు చెప్పారు. తంబళ్లపల్లె వైపు చూడని మాజీ ఎమ్మెల్యే నేడు ఇన్చార్జి పదవి కోసం పాకులాడడం హాస్యాస్పదమన్నారు. 2024 లో పార్టీ ఆదేశించిన జయచంద్రా రెడ్డి గెలుపు కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే వద్ద భజన చేసిన వారికి తిరుపతి మీటింగ్లో ప్రాధాన్యత ఇవ్వడం సమంజసం కాదని పార్టీ అధిష్టానం ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాలను, క్రమశిక్షణ తో తంబళ్లపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న జయ చంద్రారెడ్డి పై టిడిపి కోవర్టులు వైకాపా నాయకులతో కుమ్మకై కుట్ర పన్ని అక్రమ కేసుల్లో ఇరికించారని అయినా నేటికీ ప్రజలు ఆదరిస్తున్నారని అధిష్టానం ఇప్పటికైనా పునరాలోచించి నిజమైన ప్రజా సేవ చేస్తున్న జయచంద్ర రెడ్డికి ఇన్చార్జి బాధ్యతలు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికలకు ముందు పార్టీ కి రాజీనామా చేసినట్లు మీడియా ముఖంగా తెలియచేసి అధినాయకుడిని నానా బూతుల తిట్టి , పార్టీ జెండాలను కాలితో తన్నిన వ్యక్తులు అభిప్రాయాలు తీసుకోవడం ఎంత వరకు సమంజసం అని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పార్టీ కి కష్టపడిన కార్యకర్తల అభిప్రాయాలు తీసుకోకుండా ఎవరో సలహాలతో నియోజకవర్గానికి 140 కిలోమీటర్లు దూరం ఉన్న తిరుపతి లోని స్టార్ హోటల్ లో సమావేశం నిర్వహించి పార్టీ కి ద్రోహం చేసిన వ్యక్తుల అభిప్రాయాలు అధిష్టానానికి పంపడం సమంజసమేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు నియోజకవర్గంలో దృష్టి పెట్టి పార్టీకి ద్రోహం చేసిన వ్యక్తులకు పదవులు తొలగించి నిజమైన నాయకులకు పట్టం కట్టాలని కోరుతున్నాము అన్నారు.

ఈ కార్యక్రమం లో టిడిపి సీనియర్ నాయకులు మస్తాన్ రెడ్డి, సున్నపు కిట్టన్న, ఓబ్లేస్, సుబ్బన్న, మద్దినాయని పల్లి మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి, అంకిరెడ్డిపల్లి రమేష్ రెడ్డి, అశోక్,సిద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, కుంటపల్లి రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, రెడ్డివారి భాస్కర్ రెడ్డి, శీతి భాస్కర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,నారాయణరెడ్డి, గట్టు గుంటి కుమార్, కె.వి.సుబ్బారెడ్డి, మదన్ మోహన్ రెడ్డి,విశ్వనాథ రెడ్డి, దేవరా శివారెడ్డి, ఎమ్మెస్ రమణ, రామచంద్ర, రాజశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఏం శ్రీనివాసులు , నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాదర్బార్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్న చీఫ్ విప్ జీవీ

వినుకొండ సింధూరదర్శిని: వినుకొండ పట్టణం చీఫ్ విప్ వారి కార్యాలయం నందు గురువారం ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనే యులు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోగా, ఆయన వారితో నేరుగా మాట్లాడి వినతి పత్రాలను స్వీకరించారు. మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. జీవీ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల చెంతకు పాలనను చేర్చడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు బొంకూరు రోశయ్య, మాజీ కౌన్సిలర్ పివి సురేష్ బాబు,, నాయకులు, తరితరులు పాల్గొన్నారు.


# భక్తుల సాయి కీర్తనలుతో మార్మోగిన సాయిబాబా ఆలయం



క్రోసూరు సింధూరదర్శిని: షిరిడిలో వెలిసిన ఓ సాయిబాబా మా కష్టాలు తీర్చటానికి మా పల్లెకి వచ్చావయ్యా ఓ సాయి బాబా మనసును రంజింప చేసే భక్తుల కీర్తనలతో సాయిబాబా ఆలయం మార్మోగింది మండల కేంద్రం క్రోసూరు లో భక్తుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న సాయిబాబా వారిని ప్రత్యేకంగా అలంకరించారు బాబా వారికి ప్రీతికరమైన రోజు గురువారం కావటంతో భక్తులు వేకువజామునే తరలి వచ్చి బాబా వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేయించి మనసారా వేడుకున్నారు ఆలయ అర్చకులు భక్తులకు బాబా వారి దీవెనలనందించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మన్నెం వెంకట్రావు మాట్లాడుతూ ఈనెల 29 వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా బాబా వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు అలాగే గురు పౌర్ణమి రోజు ఐదు రకాల ప్రసాదాలు తయారు చేయడం జరుగుతుందని ప్రసాదాల తయారీకి విరాళాలు అందించే భక్తులు తమ పేర్లను ఆలయ కమిటీ వారిచే నమోదు చేయించుకోవాల్సిందిగా తెలి యజేశారు విరాళాలు అందించిన భక్తుల గోత్రనామాలతో గురు పౌర్ణమి రోజు ప్రత్యేకపూజలు చేయడం జరుగుతుందని తెలియపరిచారు

# పర్యావరణ సమతుల్యతకు పచ్చదనం దోహదం

### టీడీపీ యువ నాయకులు జూలకంటి గౌతమ్




రెంటచింతల సింధూరదర్శిని: రెంటచింతల (జూలై 16) పర్యావరణ సమతుల్యతకు పచ్చదనం ఎంతోగానో దోహదం చేస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు, టీడీపీ యువ నాయకులు గౌతమ్ రెడ్డి చెప్పారు. గురువారం మండల పరిధిలోని పాలువాయి గేట్, మంచికల్లులో పర్యటించిన ఆయన.., రూ.1 కోటి 80 లక్షలతో నూతనంగా నిర్మించిన మంచికల్లు తారు రోడ్డును పరిశీలించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా గ్రామస్తులతో కలిసి మొక్కలను నాటారు. మొక్కల పరిరక్షణ బాధ్యతను కూటమి పార్టీల నాయకులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గోగుల వెంకటరామిరెడ్డి, గోగుల లక్ష్మారెడ్డి, పున్నారెడ్డి, సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మీ గోర్లు విరిగిపోకుండా, మంచి షైన్ కలిగి ఉండాలని మీరు కోరుకుంటే..





దోసకాయ విత్తన నూనె, ఇందులో పోషకాలు అధికంగా ఉంటాయి. విటమిన్ బి, లినోలెయిక్ ఆమ్లం, మెగ్నీషియం, ఒలేయిక్ ఆమ్లం, ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు, పాల్మిటిక్ ఆమ్లం, పొటాషియం, సోడియం, స్టెరిక్ ఆమ్లం, విటమిన్ సి మరియు విటమిన్ ఇ వంటి వివిధ విటమిన్లు మరియు ఖనిజాలు వీటిలో ఉన్నాయి. ఈ నూనె చూడటానికి కొద్దిగా పసుపు రంగులో ఉంటుంది. ఇది మంచి దోసకాయ లాగా ఉంటుంది. ఈ దోసకాయ నూనె మీ చర్మం మరియు జుట్టులోని కొన్ని సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ నూనెను కనీసం 2 సంవత్సరాలు నిల్వ ఉంచవచ్చు. చర్మ పునరుజ్జీవనం చర్మ పునరుజ్జీవనం చర్మంపై ఉపయోగించే ఏదైనా నూనె మీ చర్మాన్ని రిఫ్రెష్ చేయదు. కానీ దోసకాయ సీడ్ ఆయిల్ మీ చర్మాన్ని రిఫ్రెష్ చేస్తుంది. ఈ నూనె తేలికగా ఉన్నందున, ఇది త్వరగా చర్మం ద్వారా గ్రహించి చర్మాన్ని మృదువుగా మరియు రిఫ్రెష్ చేస్తుంది. శోథ నిరోధక లక్షణాలు శోథ నిరోధక లక్షణాలు దోసకాయ విత్తన నూనెలో శక్తివంతమైన శోథ నిరోధక లక్షణాలు ఉన్నాయి. ముఖం మీద రుద్దినప్పుడు వృద్ధాప్యం యొక్క రూపాన్ని ఇచ్చే ముడతలు మరియు పంక్తులను తగ్గించడానికి ఇది ఒక మార్గం. ఇందులో విటమిన్ ఇ కూడా ఉంది, ఇది వృద్ధాప్య రేడియోన్యూక్లైడ్ల రూపాన్ని నియంత్రిస్తుంది మరియు అకాల వృద్ధాప్యాన్ని నిరోధిస్తుంది. మొటిమలు మొటిమలు మీరు మొటిమలతో బాధపడుతుంటే దోసకాయ విత్తన నూనెలు మీ చర్మానికి ఉత్తమ పరిష్కారం. మొటిమల ప్రదేశంలో మీకు కొద్దిగా ఎరుపు మరియు పగుళ్లు ఉండవచ్చు. దోసకాయ విత్తన నూనెలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. సన్‌స్క్రీన్ సన్‌స్క్రీన్ దోసకాయ విత్తన నూనెలను సన్‌స్క్రీన్స్‌లో కూడా ఉపయోగిస్తారు. ఎందుకంటే ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. మీ ఎండకు దెబ్బతిన్న చర్మాన్ని రిపేర్ చేయడానికి ఇది సహాయపడుతుంది. దోసకాయ విత్తన నూనె మీ చర్మాన్ని చల్లబరుస్తుంది మరియు చర్మానికి వర్తించేటప్పుడు సూర్యుడి నుండి రక్షిస్తుంది. అందమైన గోళ్లను పెంచుకోవాలనుకుంటే అందమైన గోళ్లను పెంచుకోవాలనుకుంటే మీరు అందమైన గోళ్లను పెంచుకోవాలనుకుంటే మరియు నెయిల్ పాలిష్ ఉంచడం ప్రతి ఒక్కరి ఎంపిక. కానీ గోర్లు విరిగిపోయినా లేదా గట్టిగా లేకుంటే అది కొద్దిగా చిరాకు కలిగిస్తుంది. కాబట్టి మీ గోళ్లు విరిగిపోకుండా చూసుకోవడానికి మీరు దోసకాయ విత్తన నూనెను గోళ్ళపై రుద్దాలి. త్వరలో దృఢంగా మరియు మెరిసేదిగా మారుతుంది. తర్వాత వేర్వేరు నెయిల్ పాలిష్ వర్తించవచ్చు. మాయిశ్చరైజర్ మనం ఉపయోగించే కొన్ని మాయిశ్చరైజర్లలో జిగట ఉంటుంది. అది కొందరికి కొద్దిగా బాధించేది. కాబట్టి మీరు మీ చర్మంపై పనిచేయని మరియు త్వరగా గ్రహించే మాయిశ్చరైజర్ కావాలంటే దోసకాయ విత్తన నూనెలను ఉపయోగించవచ్చు. ఇది మీ చర్మానికి అంటుకోదు మరియు త్వరగా గ్రహిస్తుంది. చర్మశోథ చర్మశోథ దోసకాయ విత్తన నూనె చర్మశోథ, సోరియాసిస్ మరియు సోరియాసిస్ చికిత్సలో కూడా సహాయపడుతుంది. ఈ నూనెలు యాంటీ ఇన్ఫ్లమేటరీ, మంచి క్రిమినాశక మరియు అద్భుతమైన లాలాజల లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ నూనెలో కొద్ది మొత్తాన్ని మీ చర్మం ప్రభావిత ప్రాంతంపై పూయడం మరియు మసాజ్ చేయడం వల్ల త్వరలో మంచి పురోగతి కనిపిస్తుంది. అలాగే, మీకు మాయిశ్చరైజర్ కావాలంటే, 1 కప్పు షియా బటర్ మరియు 1/4 కప్పు దోసకాయ సీడ్ ఆయిల్ కలిపి మిక్సర్లో రుబ్బుకోవాలి. ఈ పేస్ట్ ను ప్రభావిత ప్రదేశంలో అప్లై చేస్తే సమస్య పరిష్కరించబడుతుంది. కన్ను కన్ను మనం ప్రతిరోజూ దోసకాయను తీసుకొని దానిని భద్రంగా ఉంచలేము మరియు కళ్ళలో ఉంచలేము. దీనికి ఉత్తమ నివారణ దోసకాయ విత్తన నూనెలను ఉపయోగించడం. ఈ నూనెలు కళ్ళకు అద్భుతమైన మాయిశ్చరైజర్. ఒకటి లేదా రెండు చుక్కల నూనె తీసుకొని రోజూ కళ్ళ మీద రుద్దండి. ఇది కళ్ళ చుట్టూ ముడుతలను సరిచేయడానికి కూడా సహాయపడుతుంది. జుట్టు పెరుగుదల జుట్టు పెరుగుదల దోసకాయ విత్తన నూనెలు జుట్టు పెరుగుదలను పెంచడానికి సహాయపడతాయి. ఇది సిలికా యొక్క అవసరమైన మొత్తాన్ని కలిగి ఉంటుంది. ఈ సిలికా కొత్త జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది, అలాగే ఉన్న జుట్టును బలపరుస్తుంది మరియు జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. గిరజాల జుట్టు గిరజాల జుట్టు దోసకాయ విత్తన నూనె సహజంగా ఉంగరాల జుట్టుకు ఎంతో మేలు చేస్తుంది. ఉంగరాల జుట్టుపై దోసకాయ విత్తన నూనె వేయడం వల్ల మీ జుట్టు విచ్ఛిన్నం, రసాయనాలు, క్లోరిన్ నీరు మొదలైన వాటి నుండి నష్టపోకుండా కాపాడుతుంది. కాబట్టి దోసకాయ విత్తన నూనెను వాడండి, వాటిలో చర్మం మరియు జుట్టు ప్రయోజనాలను పొందవచ్చు.







## భారత పేసర్ గుర్నూర్ బ్రార్‌కు డీమెరిట్ పాయింట్.. ఐసీసీ సీరియస్ వార్నింగ్!

ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద ఒక డీమెరిట్ పాయింట్ నమోదు

ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో బ్యాటర్ వైపు బంతి విసిరిన ఘటన

తప్పును అంగీకరించడంతో విచారణ లేకుండానే శిక్ష ఖరారు

రెండేళ్ల కాలంలో గుర్నూర్‌కు ఇదే తొలి తప్పిదం



భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ సింగ్ బ్రార్‌పై ఐసీసీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడికి అధికారికంగా హెచ్చరిక జారీ చేయడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను రికార్డుల్లో నమోదు చేసింది. ఈ మేరకు ఐసీసీ నేడు ఒక ప్రకటన విడుదల చేసింది.

వివరాల్లోకి వెళితే.. ఈ నెల 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 8వ ఓవర్లో బౌలింగ్ చేస్తున్న గుర్నూర్ బ్రార్, బంతిని అందుకుని బ్యాటర్ వైపు అనుచితంగా, ప్రమాదకరంగా విసిరాడు. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు.

'అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా క్రీడాకారుడిపై లేదా సమీపంలోకి అనుచితంగా, ప్రమాదకరంగా బంతిని విసరడం' ఈ నిబంధన పరిధిలోకి వస్తుంది. ఈ ఆరోపణలను ఆన్‌ఫీల్డ్ అంపైర్లు కుమార్ ధర్మసేన, మైక్ బర్న్స్, థర్డ్ అంపైర్ శామ్ నొగాజ్‌స్కీ, ఫోర్త్ అంపైర్ రస్సెల్ వారెన్ మోపారు. అయితే, గుర్నూర్ బ్రార్ తన తప్పును అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ ప్రతిపాదించిన శిక్షకు అంగీకారం తెలపడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే శిక్షను ఖరారు చేశారు. గత 24 నెలల కాలంలో గుర్నూర్‌కు ఇదే మొదటి తప్పిదం కావడం గమనార్హం. లెవల్ 1 ఉల్లంఘనలకు సాధారణంగా అధికారిక హెచ్చరిక నుంచి ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు జరిమానా, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది. ఒక ఆటగాడి ఖాతాలో 24 నెలల వ్యవధిలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు చేరితే, వాటిని సస్పెన్షన్ పాయింట్లుగా మార్చి నిషేధం విధిస్తారు. రెండు సస్పెన్షన్ పాయింట్లు ఒక టెస్టు లేదా రెండు వన్డేలు/టీ20ల నిషేధానికి సమానం. కాగా, ఈ సిరీస్‌లో తొలి వన్డేను 6 వికెట్ల తేడాతో గెలిచిన భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది. నేడు కార్డిఫ్‌లో ఇరు జట్ల మధ్య రెండో వన్డే జరగనుంది.

## రోజంతా హెచ్చుతగ్గులు... ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు


సెన్సెక్స్‌కు 1.44 పాయింట్ల లాభం.. నిఫ్టీకి 5.75 పాయింట్ల నష్టం

ఫైనాన్షియల్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి

కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ సూచీలకు లాభాలు

జూన్ త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్ల దృష్టి

నిఫ్టీకి 24,200 నిరోధం.. 24,000 మద్దతు




భౌగోళిక ఉద్రిక్తతలు, ముడిచమురు ధరల్లో హెచ్చుతగ్గులు, ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు గురువారం ఫ్లాట్‌గా ముగిశాయి. సూచీలు రోజంతా భారీ హెచ్చుతగ్గులు నమోదు చేశాయి. ఆర్థిక రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్‌పై ప్రభావం చూపింది.

సెన్సెక్స్ 1.44 పాయింట్లు పెరిగి 77,186.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.75 పాయింట్ల స్వల్ప నష్టంతో 24,072.75 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 77,579.69 వద్ద గరిష్ఠాన్ని, 77,086.42 దగ్గర కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 24,186.50 గరిష్ఠం, 24,050 కనిష్ఠాన్ని నమోదు చేసింది. రంగాల వారీగా చూస్తే కన్స్యూమర్ డ్యూరబుల్స్, కెమికల్స్, మీడియా, ఐటీ, ఆటో సూచీలు లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఫైనాన్షియల్ సర్వీసెస్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ-50 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, ఇండిగో, విప్రో, మారుతీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, ఎస్‌బీఐ లైఫ్, బజాజ్ ఫిన్‌సర్వ్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాల్లో స్థిరపడ్డాయి. జూన్ త్రైమాసిక ఫలితాలు, కంపెనీల యాజమాన్యాల వ్యాఖ్యలు, రుతుపవనాల పురోగతి, అంతర్జాతీయ పరిణామాలు, ద్రవ్యోల్బణ ధోరణులు మార్కెట్‌కు కీలకంగా మారనున్నాయని విశ్లేషకులు తెలిపారు. సాంకేతికంగా నిఫ్టీకి 24,200 స్థాయి తక్షణ నిరోధకంగా ఉండగా, 24,000 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని అంచనా వేశారు.

## సిద్ధవటం ఎక్సైజ్ పరిధిలో 53 కేసులు నమోదు : సీఐ

సిద్ధవటం, సింధూరదర్శిని: సిద్ధవటం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి లోని అట్లూరు, సిద్ధవటం ఒంటిమిట్ట మండలాల్లో 53 మందిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ రాజశేఖర్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రమైన సిద్ధవటం, ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఆయన గురువారం మాట్లాడుతూ జనవరి నుండి జూన్ వరకు 6 నెలల కాల వ్యవధిలో 53 మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని అందులో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వ్యక్తులు 41 మంది, అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తులు 12 మందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు కొన్ని ప్రాంతాలలో అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు స్థానికుల నుండి ఫిర్యాదు రావడంతో మా సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 68 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, అక్రమ మద్యం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నారాయణ పాల్గొన్నారు

# ప్రపంచం అంతమైపోతుందా?.. గణితశాస్త్ర సిద్ధాంతం ఏం చెబుతోంది?



మానవాళి అంతంపై మళ్లీ తెరపైకి వచ్చిన 'డూమ్స్‌డే ఆర్గ్యుమెంట్'
గణాంకాల ఆధారంగా భవిష్యత్తును అంచనా వేస్తున్న వివాదాస్పద థియరీ
కోపర్నికన్ ప్రిన్సిపుల్ ఆధారంగా పనిచేసే ఈ సిద్ధాంతం
శాస్త్రవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు, ఇది కేవలం ఊహాగానమేనన్న వాదన
వాతావరణ మార్పులు, ఏఐ వంటి ముప్పుల నేపథ్యంలో పెరుగుతున్న ఆసక్తి

మానవజాతికి భూమిపై ఇంకా ఎంత కాలం మిగిలి ఉంది? ఈ ప్రశ్నకు సమాధానం కనుగొనే ప్రయత్నంలో భాగంగా రూపొందించిన ఓ వివాదాస్పద గణితశాస్త్ర సిద్ధాంతం మరోసారి ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. 'డూమ్స్‌డే ఆర్గ్యుమెంట్'గా పిలిచే ఈ సిద్ధాంతం, మానవాళి అంతం చాలామంది ఊహించిన దానికంటే ముందే సంభవించవచ్చని సూచిస్తోంది. దశాబ్దాలుగా ఉన్న ఈ వాదనపై శాస్త్రవేత్తలు, తత్వవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతూనే ఉన్నాయి.

**ఏమిటీ 'డూమ్స్‌డే ఆర్గ్యుమెంట్'?**

ఈ సిద్ధాంతానికి మూలం 'కోపర్నికన్ ప్రిన్సిపుల్'. దీని ప్రకారం.. విశ్వంలో గానీ, చరిత్రలో గానీ మానవులకు ప్రత్యేకమైన స్థానం ఏదీ లేదు. ఖగోళ భౌతిక శాస్త్రవేత్త బ్రాండన్ కార్టర్ దీనిని మొదట ప్రతిపాదించగా, కాస్మాలజిస్ట్ జే. రిచర్డ్ గాట్ దీనిని మరింత అభివృద్ధి చేశారు. ఈ సిద్ధాంతం ప్రకారం మానవాళి అంతానికి ఫలానా విపత్తు కారణమవుతుందని కచ్చితంగా చెప్పదు. బదులుగా సంభావ్యత, గణాంకాల ఆధారంగా ఒక అంచనా వేస్తుంది. ఇప్పటివరకు పుట్టిన, ప్రస్తుతం జీవిస్తున్న, భవిష్యత్తులో పుట్టబోయే మొత్తం మానవులలో మనల్ని ఒక యాదృచ్ఛిక వ్యక్తిగా భావిస్తే, మనం మానవ చరిత్రలో ప్రారంభంలో కాకుండా మధ్య భాగంలో ఉండేందుకే ఎక్కువ అవకాశం ఉంటుందని ఈ వాదన చెబుతుంది. ఒకవేళ మనం మధ్యలో ఉంటే, మానవజాతికి అనంతమైన భవిష్యత్తు ఉండదనేది దీని సారాంశం.

**మళ్లీ ఎందుకు తెరపైకి వచ్చింది?**

వాతావరణ మార్పులు, కృత్రిమ మేధ (ఏఐ), మహమ్మారులు, అణు యుద్ధాలు వంటి మానవ మనుగడకు ముప్పు కలిగించే అంశాలపై ప్రజల్లో ఆందోళన పెరగడమే ఈ సిద్ధాంతంపై మళ్లీ ఆసక్తి పెరగడానికి కారణమని 'ది మెట్రో' తన కథనంలో పేర్కొంది. ఈ ముప్పుల కారణంగా, మానవాళి మునుపెన్నడూ లేని విధంగా దీర్ఘకాలిక ప్రమాదాలను ఎదుర్కొంటోందా? అనే చర్చ కొత్తగా మొదలైంది. ఈ నేపథ్యంలోనే 'డూమ్స్‌డే ఆర్గ్యుమెంట్' మరోసారి ప్రాచుర్యం పొందింది.

**విమర్శలు.. వాస్తవాలు**

ఈ సిద్ధాంతాన్ని సమర్థించేవారు ఇది భవిష్యత్తును చెప్పే జోస్యం కాదని, సంభావ్యత గురించి ఆలోచించడానికి ఇదొక ఆసక్తికరమైన మార్గమని అంటారు. అయితే, విమర్శకులు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ థియరీలోని అంచనాలు చాలా సరళంగా ఉన్నాయని, నాగరికత భవిష్యత్తును కచ్చితత్వంతో అంచనా వేయలేవని వారు వాదిస్తున్నారు. 'ది మెట్రో' కథనం ప్రకారం ఇది భౌతిక ఆధారాలతో కాకుండా కేవలం సంభావ్యత అంచనాలపై ఆధారపడటం వల్లే వివాదాస్పదంగా మిగిలిపోయింది. కొందరు తత్వవేత్తలు దీనిని ఆలోచనలను రేకెత్తించే గణాంకపరమైన కసరత్తుగా భావిస్తుంటే, మరికొందరు ఆచరణాత్మక అంచనాలకు పనికిరాని ఒక 'మేధోపరమైన కుతూహలం'గా కొట్టిపారేస్తున్నారు.

మానవ వినాశనం తేదీని అంచనా వేయగల నిర్దిష్ట నమూనా ఏదీ లేదనేది విస్తృత శాస్త్రీయ ఏకాభిప్రాయం. ప్రస్తుతం పరిశోధకులు ఊహాజనిత సిద్ధాంతాలపై కాకుండా వ్యాధులు, పర్యావరణ క్షీణత, భౌగోళిక-రాజకీయ అస్థిరత వంటి వాస్తవ ప్రపంచంలోని ప్రమాదాలను గుర్తించి, వాటిని తగ్గించడంపైనే దృష్టి సారిస్తున్నారు. ఏదేమైనా ఈ 'డూమ్స్‌డే ఆర్గ్యుమెంట్' సరైనదైనా, కాకపోయినా... మానవజాతి అంతం ఎప్పుడు అనే దానికంటే, మనం ఆ క్షణానికి అనుకున్నదానికంటే చాలా దగ్గరగా ఉన్నామా? అనే పాత ప్రశ్నను మన ముందు ఉంచుతూ చర్చను సజీవంగా ఉంచుతోంది.

## బ్యాంకులపై ఫిర్యాదులున్నాయా?..

**ఆర్బీఐ ద్వారా రూ.33 లక్షల వరకు పరిహారం!**

బ్యాంకులపై ఫిర్యాదుల పరిష్కారానికి ఆర్బీఐ కొత్త ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ పథకం
సేవా లోపాలకు గరిష్ఠంగా రూ.33 లక్షల వరకు పరిహారం పొందే అవకాశం




బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఇతర ఆర్థిక సంస్థలన్నీ ఈ పథకం పరిధిలోకి
ముందుగా సంబంధిత సంస్థకు ఫిర్యాదు చేసి, పరిష్కారం లభించకపోతేనే అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలి

**నష్టాన్ని రుజువు చేసే పటిష్ఠమైన ఆధారాలు సమర్పించడం తప్పనిసరి**

బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల సేవల్లో లోపాల వల్ల నష్టపోయిన వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఒక కీలకమైన అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. సంబంధిత సంస్థ వద్ద తమ ఫిర్యాదు పరిష్కారం కానప్పుడు, నేరుగా ఆర్‌బీఐని ఆశ్రయించి రూ.33 లక్షల వరకు పరిహారం పొందేందుకు వీలు కల్పించింది. ఈ ఏడాది జులై నుంచి అమల్లోకి వచ్చిన 'రిజర్వ్ బ్యాంక్ - ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ స్కీమ్ (ఆర్బీ-ఐఓఎస్)-2026' కింద ఈ కొత్త విధానం పనిచేస్తుంది.

బ్యాంకులు, కొన్ని నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు), క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు, ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాల జారీదారులు, ఇతర ఆర్‌బీఐ నియంత్రిత సంస్థలపై వినియోగదారులు తమ ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి ఈ పథకం ఒక ఉచిత, స్వతంత్ర వేదికగా ఉపయోగపడుతుంది.

వినియోగదారుడు మొదట తన సమస్యపై సంబంధిత బ్యాంకు లేదా ఆర్థిక సంస్థకు ఫిర్యాదు చేయాలి. నిర్దేశిత గడువులోగా వారి నుంచి స్పందన రాకపోయినా, వారు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకపోయినా లేదా ఫిర్యాదును తిరస్కరించినా, అప్పుడు మాత్రమే ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలి.


ఈ పథకం కింద సేవా లోపం వల్ల రుజువైన ఆర్థిక నష్టానికి గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం లభించే అవకాశం ఉంది. దీనికి అదనంగా, ఫిర్యాదు చేయడానికి వెచ్చించిన సమయం, ఖర్చులు, ఎదుర్కొన్న మానసిక వేదనకు గాను మరో రూ.3 లక్షల వరకు పరిహారం మంజూరు చేసే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీంతో మొత్తం పరిహారం రూ.33 లక్షలకు చేరుతుంది.

అయితే, ఈ పరిహారం అనేది అన్ని కేసుల్లోనూ కచ్చితంగా లభిస్తుందని భావించరాదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ప్రతి కేసులోని వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకుంటారు. బ్యాంకు లేదా ఆర్థిక సంస్థ సేవా లోపం వల్లే తనకు ప్రత్యక్షంగా నష్టం వాటిల్లిందని ఫిర్యాదుదారుడు పటిష్ఠమైన ఆధారాలతో నిరూపించుకోవాల్సి ఉంటుంది.

అందువల్ల అంబుడ్స్‌మన్‌ను సంప్రదించే ముందు వినియోగదారులు కొన్ని ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. బ్యాంకుకు సమర్పించిన ఫిర్యాదు కాపీ, దానికి కేటాయించిన రిఫరెన్స్ నంబర్, లావాదేవీల రికార్డులు, ఈమెయిళ్లు, స్క్రీన్‌షాట్‌లు, బ్యాంకు నుంచి వచ్చిన ప్రతిస్పందన కాపీ వంటివి ఇందులో కీలకం. వీటితో పాటు తాము ఎంత నష్టపోయామో, ఎంత పరిహారం ఆశిస్తున్నామో స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది. ఈ ఆధారాలు ఫిర్యాదుదారుడి వాదనకు బలం చేకూర్చుతాయి.

# బరువు తగ్గేందుకు ఈ 4 తప్పులు చేయొద్దు: న్యూట్రిషనిస్ట్

సోషల్ లైఫ్‌ను పూర్తిగా వదిలేయొద్దని సూచన - ఆకలితో ఉండటం మెటబాలిజాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరిక
క్యాలరీల లెక్కలకే పరిమితం కావొద్దని సూచన - సమతుల జీవనశైలే స్థిరమైన వెయిట్ లాస్‌కు మార్గమని హితవు



బరువు తగ్గాలనే లక్ష్యంతో చాలామంది కఠినమైన డైట్‌లు, సోషల్ మీడియా ట్రెండ్‌లను అనుసరిస్తుంటారు. అయితే అవి తాత్కాలిక ఫలితాలే ఇస్తాయని, ఆరోగ్యానికి కూడా హానికరమయ్యే అవకాశం ఉందని ప్రముఖ న్యూట్రిషనిస్ట్, సెలబ్రిటీ డైటీషియన్ నమామి అగర్వాల్ చెబుతున్నారు. బరువు తగ్గే క్రమంలో ఎప్పటికీ చేయకూడని నాలుగు అలవాట్లను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో వివరించారు.

**సోషల్ లైఫ్‌కు దూరం కావొద్దు**

బరువు తగ్గాలనే కారణంతో కుటుంబ వేడుకలు, స్నేహితులతో సమావేశాలను పూర్తిగా దూరం పెట్టడం మంచిది కాదని ఆమె సూచించారు. ఇలా చేయడం వల్ల ఒత్తిడి, ఒంటరితనం పెరిగి భావోద్వేగాలతో ఎక్కువగా తినే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ఆకలితో ఉండొద్దు**

తక్కువ సమయంలో బరువు తగ్గాలనే ఉద్దేశంతో చాలా తక్కువ ఆహారం తీసుకోవడం లేదా ఆకలితో ఉండటం సరైన మార్గం కాదని చెప్పారు. ఇలా చేస్తే శరీరంలోని జీవక్రియ (మెటబాలిజం) మందగించి, ఆకలి హార్మోన్లు పెరిగే ప్రమాదం ఉంటుందని వివరించారు.

**క్యాలరీల లెక్కలకే పరిమితం కావొద్దు**

బరువు నియంత్రణలో కేవలం క్యాలరీలు మాత్రమే కీలకం కావని నమామి పేర్కొన్నారు. నిద్ర, ఒత్తిడి, హార్మోన్ల సమతుల్యత, జీర్ణక్రియ, ఆహార నాణ్యత వంటి అంశాలు కూడా బరువుపై ప్రభావం చూపుతాయని తెలిపారు.

**ఆహార పదార్థాలను పూర్తిగా మానేయొద్దు**

వైద్యపరమైన అవసరం లేకపోతే ఏ ఆహారాన్నీ పూర్తిగా మానేయకూడదని సూచించారు. అలా చేస్తే శరీరానికి అవసరమైన పోషకాలు, ఫైబర్ తగ్గిపోవడంతో పాటు పేగుల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. అన్ని రకాల పోషకాలు ఉండే సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన బరువు తగ్గడం అంటే శరీరాన్ని శిక్షించడం కాదని, సమతుల జీవనశైలిని అలవాటు చేసుకోవడమే నిజమైన పరిష్కారమని నమామి అగర్వాల్ పేర్కొన్నారు.

# 9వ తరగతిలో మూడో భాష ఎందుకు?: సీబీఎస్ఈని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

9వ తరగతిలో మూడో భాష ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం
9వ తరగతిలో మూడో భాషను ప్రారంభించడం కాదు, ఆపేయాలన్న కోర్టు
ఇది విద్యార్థులపై అనవసర ఒత్తిడి పెంచుతుందని వ్యాఖ్య
కొత్త భాషను 6వ తరగతిలోనే ప్రవేశపెట్టాలని కేంద్రానికి సూచన
తమిళనాడులో నవోదయ విద్యాలయాల కేసు విచారణలో ఈ వ్యాఖ్యలు



9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టాలన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పదో తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులపై ఇది అదనపు భారాన్ని మోపుతుందని, వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం విచారణ సందర్భంగా కోర్టు కీలకమైన మౌఖిక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టడం సరికాదు. ఆ వయసులో విద్యార్థులు ఇప్పటికే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. అటువంటి సమయంలో కొత్త భాషను ఎందుకు పరిచయం చేస్తారు? అవసరమైతే ఆరో తరగతి నుంచే దీని అమలు చేయండి" అని జస్టిస్ నాగరత్న కేంద్రానికి సూచించారు. పదో తరగతి బోర్డు పరీక్షల తాలూకు ఒత్తిడి ఎనిమిదో తరగతి నుంచే మొదలవుతుందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న సీబీఎస్ఈ నూతన నిబంధనల ప్రకారం, 9వ తరగతి విద్యార్థులు మూడు భాషలను అభ్యసించాల్సి ఉంటుంది. అందులో కనీసం రెండు భారతీయ భాషలు ఉండటం తప్పనిసరి. ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు, దీని అమలుపై స్టే ఇచ్చేందుకు మాత్రం అప్పట్లో నిరాకరించింది. తమిళనాడులో ద్విభాషా విధానం అమల్లో ఉన్న నేపథ్యంలో, నవోదయ పాఠశాలల ఏర్పాటుపై కోర్టు ప్రత్యేకంగా ప్రస్తావించింది. త్రిభాషా సూత్రంలో హిందీ తప్పనిసరి కాదని, సంస్కృతం లేదా ఇతర ప్రాంతీయ భాషలను ప్రత్యామ్నాయాలుగా పరిశీలించవచ్చని పేర్కొంది. నవోదయ విద్యాలయాలకు భూ కేటాయింపులపై తగిన నిర్ణయం తీసుకునేందుకు తమిళనాడు ప్రభుత్వానికి ఆగస్టు 11 వరకు సమయం ఇచ్చింది. ప్రస్తుత విచారణలో కోర్టు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, ధర్మాసనం చేసిన మౌఖిక వ్యాఖ్యలు విద్యావర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# సినిమా న్యూస్



భాగ్యశ్రీ బోర్సే ఫ్యాషన్ సెన్స్ ఒక మాస్టర్ క్లాస్ ఈ సినిమాలో శ్రీలీల స్థానంలో భాగ్యశ్రీ నటించారని నివేదికలు చెబుతున్నాయి. ఆమె బిజీగా ఉన్న షెడ్యూల్ కారణంగా శ్రీలీల తప్పుకోవాల్సి వచ్చింది.

## డిసెంబర్ 3న ఫౌజీ దండయాత్ర!


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుసగా విభిన్న కథలతో ప్రేక్షకులను అలరించేందుకు ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌లు, గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కుతున్న ఆయన సినిమాలపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో, డైరెక్టర్ హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఫౌజీ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ సినిమా డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ కానుందని మేకర్స్ వెల్లడించారు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో పాటు రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో ప్రభాస్ పవర్‌ఫుల్ అవతారంలో కనిపిస్తూ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. 1940ల నాటి కాలాన్ని గుర్తు చేసే డబుల్ బ్యారెల్ గన్ చేతిలో పట్టుకుని, చుట్టూ శత్రువుల మృతదేహాల మధ్య కూర్చున్న ప్రభాస్ లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. భారీ శరీరాకృతి, గంభీరమైన హావభావాలు, ఒంటరిగా భారీ సైన్యాన్ని ఎదుర్కొన్న యోధుడిలా కనిపిస్తున్న ప్రభాస్ గెటప్ పోస్టర్‌కు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచింది. సినిమా యాక్షన్ స్థాయి, విజువల్ గ్రాండియర్ ఏ రేంజ్‌లో ఉండబోతుందో ఈ ఒక్క పోస్టర్‌తోనే మేకర్స్ హింట్ ఇచ్చారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. దాదాపు రెండేళ్లుగా ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. అయితే సినిమా అప్‌డేట్స్, రిలీజ్ డేట్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్



చేయడంతో పాటు పవర్‌ఫుల్ పోస్టర్‌ను రిలీజ్ చేయడం ద్వారా మేకర్స్ ఫ్యాన్స్ లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. భారత స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన సంఘటనల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాను డైరెక్టర్ హను రాఘవపూడి తన కెరీర్‌లోనే మోస్ట్ ప్రిస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్, భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషన్స్ కు ప్రాధాన్యం ఉన్న కథతో ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి ఇస్మాయెల్ నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ ను అందిస్తున్నారు. ఎమోషన్స్ తో పాటు యాక్షన్‌ను సమపాళ్లలో మిళితం చేసే హను రాఘవపూడి శైలికి విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ సినిమాకు మరింత బలాన్ని చేకూర్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక రిలీజ్ డేట్ పరంగా కూడా ఫౌజీకి అనుకూల పరిస్థితులే కనిపిస్తున్నాయి.

డిసెంబర్ 3న సినిమా రిలీజ్ కావడంతో క్రిస్మస్ హాలిడే సీజన్ వరకు బాక్సాఫీస్ వద్ద మంచి రన్ దక్కే అవకాశం ఉంది. గత కొన్నేళ్లుగా డిసెంబర్ ఫస్ట్ వీక్ లో రిలీజైన పలు సినిమాలు భారీ సక్సెస్‌లు సాధించిన నేపథ్యంలో, అదే సెంటిమెంట్ ఈ సినిమాకు కూడా కలిసి వస్తుందనే ఆశాభావం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. భారీ స్థాయి నిర్మాణ విలువలు, ప్రభాస్ స్టార్‌డమ్, హను రాఘవపూడి విజన్ కలిసి ఫౌజీని ఈ ఇయర్ మోస్ట్ అవెయిటెడ్ పాన్ ఇండియన్ మూవీస్‌లో ఒకటిగా నిలబెట్టాయి.

## నిజం చెప్పేసిన జగపతి బాబు... సినిమా ఈవెంట్స్‌పై సూటి విమర్శలు!



టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతి బాబు ఎప్పుడూ ముక్కుసూటిగా మాట్లాడతారనే సంగతి మనందరికీ తెలిసిందే. తాజాగా ఆయన, లయ, హృతిక ప్రధాన పాత్రల్లో నటించిన 'వదలా' సినిమా జులై 17న థియేటర్లలోకి రాబోతోంది. ఆకెళ్ల వి.కృష్ణ దర్శకత్వంలో, తమ్మారెడ్డి భరద్వాజ్, కిశోర్ నాయుడు సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. అయితే, ఈ ప్రమోషన్స్ ఇంటర్వ్యూలోనే జగపతి బాబు సినిమా ఈవెంట్లు, ఫంక్షన్లపై చేసిన కొన్ని హాట్ కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీశాయి. ూశ్రీంశీ =ఘు - దమ్ము సరిపోవడం లేదా? ఛాన్స్ రావడం లేదా? సినిమా ఫంక్షన్స్ చాలా బోర్: సాధారణంగా సినిమా ఫంక్షన్లు అంటే రంగుల ప్రపంచం, హంగామా అనుకుంటారు. కానీ జగపతి బాబు మాత్రం సినిమా ఫంక్షన్స్ చాలా బోర్ అని తేల్చి చెప్పారు. అక్కడ అస్సలు ప్లేస్ ఉండదని, మమ్మల్ని కేవలం ఒక ప్రాపర్టీ లాగా మాత్రమే వాడుకుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక స్టేజ్ మీద నిలబెట్టి కేవలం ప్రమోషన్ కోసం వాడుకోవడం తప్ప, సీనియర్ నటులకు ఇచ్చే ప్రాధాన్యత అక్కడ తక్కువగా ఉంటుందనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడటం అందరినీ ఆలోచింపజేస్తోంది. పొగడటం నా వల్ల కాదు: ఇక ఈవెంట్లలో జరిగే అతి భజన గురించి జగపతి బాబు తనదైన శైలిలో స్పందించారు. స్టేజ్ ఎక్కిన తర్వాత లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు ఒకరినొకరు పొగుడుకోవడం తన వల్ల అస్సలు కాదని స్పష్టం చేశారు. అలా అబద్ధాలు చెబితే నా ఫేస్ లోనే అందరికీ తెలిసిపోతుంది. నేను ఫేక్ ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వలేను అని చెప్పుకొచ్చారు. ఆయన ముఖంలో ఆ ఫీలింగ్స్ చూసిన తర్వాత, అసలు ఈయన్ని ఎందుకు పిలిచామా బాబోయ్ అని హీరో, డైరెక్టర్లు కూడా తర్వాత ఫీల్ అవుతుంటారని నవ్వుతూనే అసలు నిజం బయటపెట్టారు. వదలా సినిమాతో గ్రాండ్ కంబ్యాక్: ఏదేమైనా జగపతి బాబు చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సినిమా ఈవెంట్లలో జరిగే డ్రామాలను ఆయన ఇంత ఓపెన్‌గా విమర్శించడం నిజంగా గ్రేట్ అని నెటిజన్లు మెచ్చుకుంటున్నారు.

ఇకపోతే మొన్న పెద్ది మూవీ తో మెప్పించిన జగపతి బాబు ఇప్పుడు 'వదలా' సినిమా తో జులై 17న ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఇక లయ, జగపతిబాబు కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. సినిమా ఇండస్ట్రీలో ఎంత పెద్ద స్టార్ అయినా స్టేజ్ ఎక్కితే భజన చేయక తప్పని ఈ రోజుల్లో జగపతి బాబు లాంటి సీనియర్ నటుడు ఇంత సూటిగా నిజాయితీగా మాట్లాడటం విశేషం. ఇక ఆయన మాటలు ఈవెంట్ల నిర్వాహకులకు కాస్త చేదుగా అనిపించినా అది ముమ్మాటికీ పచ్చి నిజం. మరి ఈ వైవిధ్యమైన కామెంట్స్ మధ్య రేపు థియేటర్లలోకి రాబోతున్న 'వదలా' సినిమా ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో, బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## జపాన్‌లో టాలీవుడ్ హీరోలదే హవా.. ఇంకెవరికీ ఛాన్స్ లేదు..

ప్రస్తుతం అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద.. ముఖ్యంగా జపాన్ దేశంలో భారతీయ సినిమాలకు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. అయితే అక్కడ కేవలం మన టాలీవుడ్ స్టార్ హీరోల హవా మాత్రమే నడుస్తోందని.. ఇతరులకు అక్కడ బ్రేక్ దక్కడం అంత సులువు కాదని మరోసారి రుజువైంది. గతంలో జపాన్ ప్రజలు -బాహుబలి- చిత్రాన్ని బ్రహ్మాండంగా ఆదరించడానికి కారణం.. అక్కడి స్థానిక జానపద కథలకు ఆ సినిమా కథాంశం చాలా దగ్గరగా ఉండటమే కాకుండా... ఆరడుగుల ఆజానుబాహుడైన ప్రభాస్ కటౌట్ జపనీయులకు బాగా కనెక్ట్ అవ్వడం. ఆ తర్వాత వచ్చిన === చిత్రంతో ఎన్టీఆర్, రామ్ చరణ్ కూడా జపాన్ ప్రజల గుండెల్లో బలమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. మన తెలుగు స్టార్లు జపాన్‌ను మన నైజాం ఏరియాలాగే ఒక సొంత మార్కెట్‌గా మార్చుకోవడంలో వంద శాతం సఫలమయ్యారు. ? కానీ ఎందుకనో బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ నటించిన లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -ధురంధర్- జపాన్ ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా - పాన్ ఇండియా స్థాయిలో దాదాపు రూ. 3000 కోట్ల భారీ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించిన ఈ చిత్రం.. జపాన్ బాక్సాఫీస్ వద్ద మాత్రం అత్యంత దీనమైన ఓపెనింగ్స్‌తో పూర్తిగా తేలిపోయింది. బాలీవుడ్ ఎనర్జిటిక్ హీరో హవా జపాన్ లో కొనసాగలేదు సరికదా.. కనీసం డే వన్ లో టాప్ 25 వసూళ్ల జాబితాలో కూడా చోటు దక్కకపోవడం ఆశ్చర్యపరిచింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. -ధురంధర్- చిత్రం జపాన్ వ్యాప్తంగా దాదాపు 80 స్క్రీన్స్‌లలో విడుదలైనా మొదటి రోజు ముగిసే సమయానికి కేవలం 900 కంటే తక్కువ మంది ప్రేక్షకులు మాత్రమే ఈ సినిమాను థియేటర్లలో చూశారు. జపాన్‌లో భారతీయ సినిమాలకు ఒక స్థిరమైన, భారీ మార్కెట్ ఏర్పడిన ఈ తరుణంలో ఈ స్థాయి తక్కువ కలెక్షన్స్ ఊహించని షాక్ అనే చెప్పాలి. గతంలో అల్లు అర్జున్ నటించిన -పుష్ప 2- చిత్రం కూడా జపాన్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై.. చివరికి టాప్ 10 జాబితాలోకి రాకుండా 14వ స్థానంతో సరిపెట్టుకోగా.. ఇప్పుడు -ధురంధర్- సైతం అదే తరహాలో నిరాశాజనకమైన ఫలితాన్ని అందుకుంది. ఈ భారీ పరాజయానికి ప్రధాన కారణం చిత్ర యూనిట్ అనుసరించిన ప్రమోషన్ల లోపమేనని స్పష్టమవుతోంది. జపాన్ లాంటి దేశాల్లో సినిమాలను విడుదల చేసేటప్పుడు అక్కడి స్థానిక ప్రేక్షకులకు రీచ్ అయ్యేలా వినూత్నంగా పబ్లిసిటీ చేయాల్సి ఉంటుంది.

కానీ -ధురంధర్- టీమ్ అక్కడ ఎటువంటి ప్రమోషన్లు చేయకపోవడంతో పాటు, సినిమా విడుదలకు సరైన వ్యూహాన్ని అనుసరించలేదు. వీటన్నింటికీ తోడు జపాన్ మార్కెట్‌కు అసలు తగని, డల్ సీజన్‌లో చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురావడం ఈ సినిమాకు అతిపెద్ద మైనస్‌గా మారింది. ఫలితంగా జపాన్‌లో అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన టాప్ 10 భారతీయ సినిమాల జాబితాలో నిలవాలన్న వీరి ఆశలు అడియాశలయ్యాయి. జపాన్ బాక్సాఫీస్ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే... అక్కడ ఇప్పటికీ మన టాలీవుడ్ సినిమాలే అగ్రస్థానంలో రాజ్యమేలుతున్నాయి.



## హీరో అవ్వాలనే తొందర లేదట!

స్టార్ హీరోల వారసులు సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెడితే అందరి నుంచి ఎదురయ్యే మొదటి ప్రశ్న ఒకటే ఉంటుంది హీరోగా ఎప్పుడు ఎంట్రీ? అని. అభిమానులు కూడా అదే ఆసక్తితో ఎదురుచూస్తారు. అయితే కోలీవుడ్ స్టార్ విజయ్ కొడుకు జేసన్ సంజయ్ మాత్రం ఆ అంచనాలకు భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. హీరోగా త్వరగా వెండితెరపై కనిపించాలనే ఆలోచన కంటే, డైరెక్టర్ గా తన స్టామినాను ప్రూవ్ చేసుకోవడంపైనే ప్రస్తుతం ఫుల్ ఫోకస్ ను పెట్టినట్టు అతని తాజా వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఇటీవలి కాలంలో యంగ్ డైరెక్టర్ల ఆలోచనా విధానంలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు తొలి సినిమాగా లవ్ స్టోరీ లేదా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ఎంచుకోవడం సేఫ్ ఆప్షన్‌గా భావించేవారు. కానీ ఇప్పుడు న్యూ ఏజ్ ఫిల్మ్‌మేకర్లు తమ మొదటి ప్రయత్నానికే విభిన్న కాన్సెప్ట్స్, కొత్త జానర్లు, హై- కాన్సెప్ట్ కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. జేసన్ సంజయ్ కూడా అదే ట్రెండ్‌ను కొనసాగిస్తున్నట్లు కనిపిస్తోంది. డైరెక్టర్ గా మారాలని డిసైడ్ అయిన తర్వాత తన వయసును దృష్టిలో పెట్టుకుని అందరూ తాను ఒక రొమాంటిక్ లవ్ స్టోరీ తెరకెక్కిస్తానని భావించారని జేసన్ చెప్పాడు. కానీ లవ్ స్టోరీ కంటే, ఒక గ్యాంగ్ చుట్టూ తిరిగే అడ్వెంచరస్ హైస్ట్ స్టోరీ చెప్పాలనే ఆసక్తి తనకు ఎక్కువగా ఉందని వెల్లడించాడు. ఈ ఒక్క డెసిషనే ఆయన కథల ఎంపికలో సేఫ్ జోన్‌ను కాకుండా, కొత్తదనాన్ని ప్రాధాన్యంగా చూస్తున్నారని చెప్పేలా ఉంది. అంతేకాదు, యాక్టర్ గా ఎప్పుడు పరిచయం అవుతారనే ప్రశ్నకు కూడా జేసన్ ఇచ్చిన సమాధానం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం తన పూర్తి దృష్టి సిగ్మా సినిమాపైనే ఉందని, ఆ సినిమా రిలీజైన తర్వాతే యాక్టింగ్ గురించి ఆలోచిస్తానని ఆయన స్పష్టం చేశారు. స్టార్ హీరో కొడుకుగా వెంటనే హీరో అవ్వాలని తొందరపడకుండా, డైరెక్టర్ గా ముందుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవాలనే ఆలోచన సంజయ్ కెరీర్ ప్లానింగ్‌లో కనిపిస్తోంది. సాధారణంగా స్టార్ కిడ్స్‌కు భారీ లాంచ్‌లు, కమర్షియల్ ఎంట్రీలు, మాస్ ఇమేజ్ బిల్డప్ వంటి అంశాలు ముందుగా డిస్కషన్ కు వస్తుంటాయి. కానీ జేసన్ సంజయ్ మాత్రం ఆ అంచనాల కంటే భిన్నంగా తన ప్రయాణాన్ని నిర్మించుకోవాలని చూస్తున్నాడు. డైరెక్టర్ గా తొలి సినిమాతో తన విజన్‌ను ప్రూవ్ చేసుకుని, ఆ తర్వాతే నటుడిగా కొత్త అడుగు వేయాలనే వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. సినీ పరిశ్రమలో కంటెంట్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను చూస్తే, సంజయ్ తీసుకున్న ఈ డెసిషన్ కూడా అదే దిశగా ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662